విలేఖరులు కావలెను
రాయల్ జర్నలిజం ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM
రాష్ట్ర వ్యాప్తముగా అన్ని జిల్లా లకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్ లు, నియోజకవర్గ స్థాయి ఇంచార్జ్ లు, మండలముల వారిగా రిపోర్టర్ లు కావలెను.
(అనుభవము కలవారికి ప్రాధాన్యత కలదు)
పూర్తి వివరములకు : 6281086394 సంప్రదించగలరు
ఎడిటర్
చల్లా శ్రీకాంత్

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNALISM
RNI : APBIL/2023/86665
గుంటూరు సంపుటి : 01 సంచిక : 39 చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు 24 శుక్రవారం మే 2024 పేజీలు : 8 వెల :రూ 2-00
GUNTUR VOL-01 ISSUE -39 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 24 FRIDAY MAY 2024 PAGES : 8 Rs :2-00

## బాంబు బెదిరింపులు.. వణుకుతున్న బెంగళూరు!



బెంగళూరు: దేశంలోని ప్రముఖ నగరాల్లో బాంబు బెదిరింపులు ఆగడంలేదు. తాజాగా కర్ణాటక రాజధాని బెంగళూరు లోని ప్రముఖ హోటల్ ఒట్టేరా సహా మరో రెండింటికి బెదిరింపులు వచ్చాయి.ఒక ఈ-మెయిల్ అడ్రస్ నుంచి ఇవి వచ్చినట్లు ఆయా యాజమాన్యాలు తెలిపాయి. నేడు ఆ హోటళ్లు పేల్చివేస్తామని దీనిలో హెచ్చరించారు.సమాచారం అందుకున్న భద్రతా బలగాలు రంగంలోకి దిగి ముమ్మర తనిఖీలు చేపట్టాయి. వీటి సమీప ప్రాంతాల్లో భారీ స్థాయిలో పోలీసులను మోహరించారు. ఇంతవరకు ఎలాంటి అనుమానాస్పద వస్తువులను గుర్తించలేదని.. తనిఖీలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. గతంలోనూ బెంగళూరులోని 40కి పైగా పాఠశాలలకు బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపింది.ఇటీవల దేశ రాజధాని దిల్లీలోని వందకు పైగా స్కూళ్లకు ఈ తరహా బెదిరింపులే వచ్చిన విషయం తెలిసిందే. నాడు అనుమానిత వస్తువులు లభ్యం కాకపోవడంతో అదంతా బూటకమని తేలింది. కొన్ని గంటల క్రితమే నార్త్ బ్లాక్‌లోని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఈ-మెయిల్ బెదిరింపు వచ్చింది. కానీ, అక్కడ ఎటువంటి అనుమానిత వస్తువులు గుర్తించలేదు.

## పిన్నెల్లిని త్వరలోనే అరెస్టు చేసి తీరుతాం: సీఈవో ఎంకే మీనా

అమరావతి: మాచర్ల నియోజకవర్గం పరిధిలోని పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో సరైన సమాచారం ఇవ్వనందుకు విధుల్లో ఉన్న పీవో, ఏపీవోలను సస్పెండ్ చేయాలని ఆదేశాలిచ్చినట్టు సీఈవో ముకేశ్ కుమార్ మీనా తెలిపారు.ఈ కేసులో నిందితుడిగా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసేందుకు ఎస్పీ, డీఎస్పీలతో 8 పోలీసు బృందాలు పనిచేస్తున్నాయన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు విషయంలో ఈసీ సీరియస్‌గా ఉందని, త్వరలోనే అరెస్టు చేసి తీరుతామని స్పష్టం చేశారు. మాచర్ల నియోజకవర్గంలో గాయపడిన కార్యకర్తల్ని పరామర్శించేందుకు తెదేపా నేతలు వెళ్లటం ఇప్పుడు మంచిది కాదని, ఇప్పుడిప్పుడే పరిస్థితులు అదుపులోకి వస్తున్నాయన్నారు. పరామర్శలకు ఈ సమయంలో వెళ్లొద్దని రాజకీయ నేతలకు విజ్ఞప్తి చేశారు."బయటి నుంచి నేతలెవరూ పరామర్శకు వెళ్లకూడదు, ఎవరినీ ఆ గ్రామాలకు వెళ్లనీయొద్దని సూచనలు జారీ చేశాం. పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేసిన దృశ్యాలు ఈసీ నుంచి బయటకు వెళ్లలేదు. దర్యాప్తు



సమయంలో ఎక్కడో.. ఎవరి చేతి నుంచో బయటకు వెళ్లాయి. ఈనెల 25 నుంచి స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించేందుకు రాష్ట్రంలో పర్యటిస్తా" అని ఎంకే మీనా తెలిపారు.

**ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు..**

జూన్ 4న ఓట్ల లెక్కింపునకు పటిష్ట మైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సీఈవో ఎంకే మీనా ఆదేశాలు జారీ చేశారు. ఫలితాలను కచ్చితత్వంతో త్వరితగతిన ప్రకటించేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్ ఏర్పాట్లపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపులో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా చూడాలన్నారు. ఎన్ని టేబుళ్లు, ఎన్ని రౌండ్ల లెక్కింపు అనే విషయాలను తెలియజేయాలని సూచించారు."కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక మీడియా సెంటర్లు ఏర్పాటు చేయాలి. కౌంటింగ్ సంబంధిత వివరాలను అభ్యర్థులు, ఏజెంట్లకు ముందుగానే తెలియజేయాలి. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఈవీఎంల తరలింపు మార్గాలు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లేందుకు వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేయాలి. బారికేడ్లు, సూచికలను కూడా ఏర్పాటు చేయాలి. అసెంబ్లీ, పార్లమెంట్‌కు వేర్వేరుగా పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి ఓట్ల లెక్కింపు టేబుళ్లను ఏర్పాటు చేయాలి. పోస్టల్ బ్యాలెట్ల లెక్కించాకే, ఈవీఎంల లెక్కింపు మొదలు కావాలి. ఈసీ నిర్వహించే ఎన్‌కోర్ వెబ్ అప్లికేషన్‌లో ఫలితాలను వెంటనే అప్‌లోడ్ చేయాలి. అనధికార వ్యక్తులు, గుర్తింపు కార్డులు లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ కేంద్రాలకు అనుమతించొద్దు. లెక్కింపు పూర్తయ్యే వరకు స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత కొనసాగుతుంది" అని మీనా స్పష్టం చేశారు.

## 'పాలే లేవు.. నెయ్యి కోసం కొట్లాట': విపక్ష కూటమిపై మోదీ ఎద్దేవా

చండీగఢ్: సార్వత్రిక ఎన్నికల సమరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో ప్రధాని మోదీ విస్తృతంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. విపక్ష 'ఇండియా' నేతలపై విమర్శలు గుప్పిస్తున్నారు.తాజాగా ఆయన హరియాణాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు.విపక్ష కూటమి గురించి మాట్లాడుతూ.. ఆవు ఇంకా పాలు ఇవ్వనేలేదు. కానీ, అక్కడ నెయ్యి కోసం ఘర్షణ మొదలైందని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి పదవిని ఉద్దేశించి ఆయన ఈ మాటన్నారు. అలాగే ఐదు సంవత్సరాలకు ఐదుగురు పీఎంలు అని వారే చర్చించుకుంటున్నారని వ్యాఖ్యలు చేశారు. "ఈ ఎన్నికల్లో మీ ఓటు ప్రధానిని ఎన్నుకోవడంతో పాటు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మీకు ఒక వైపు మీరు పరీక్షించిన సేవకుడు మోదీ ఉన్నాడు.. అవతలివైపు ఉన్న కూటమికి ఎవరు నాయకత్వం వహిస్తున్నారో తెలీదు. ఇండియా బ్లాక్‌లో కులతత్వం, మతతత్వం, బంధుప్రీతి ఎక్కువ. మోదీ ఉన్నంతకాలం దళితులు, గిరిజనుల రిజర్వేషన్లను ఎవరూ దోచుకోలేరు. హరియాణా ప్రజలు నాపై ఎంతో ప్రేమను కురిపించారు. మీతో నాకు విడదీయరాని అనుబంధం ఉంది" అంటూ మోదీ మాట్లాడారు."1962లో మనం చైనా చేతిలో



ఓటమి చవిచూశాం. ఆ ఓటమికి వారు(కాంగ్రెస్) సైన్యాన్ని బాధ్యుల్ని చేశారు. మన మిలిటరీని కించపరిచే అవకాశాల కోసం ఆ పార్టీ ఇప్పటికీ ఎదురుచూస్తోంది. పశ్చిమ్ బెంగాల్‌లో రాత్రికిరాత్రి ముస్లింలకు ఓబీసీ సర్టిఫికెట్లు జారీ చేశారు. వాటిని అందుకున్నవారిలో చొరబాటుదారులు కూడా ఉన్నారు. ఇప్పుడు అవి చెల్లవని కోర్టు తీర్పు ఇచ్చింది" అని దుయ్యబట్టారు. విపక్ష పార్టీలు అధికారంలోకి వస్తే.. తమ హయాంలో జరిగిన అభివృద్ధి ఫలాలను వారి ఓటు బ్యాంకుకు అప్పగిస్తారని ఆరోపించారు.

## కాంగ్రెస్‌కు 40 సీట్లే.. తుడిచిపెట్టుకుపోవడం ఖాయం: అమిత్ షా

లఖ్‌నవూ: ఓటు బ్యాంకు పోతుందన్న భయంతోనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ అయోధ్య రామమందిరాన్ని దర్శించలేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విమర్శించారు.ఈ ఎన్నికల్లో భాజపా 310 కంటే ఎక్కువ స్థానాలను గెలుచుకుంటుందని, కాంగ్రెస్ మాత్రం 40 సీట్లకే పరిమితమవుతుందని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని అంబేడ్కర్ నగర్, దోమరియాగంజ్, సంత్ కబీర్ నగర్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. ప్రధానంగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఇప్పటివరకు జరిగిన 5 విడతల పోలింగ్ సరళిని పరిశీలిస్తే.. కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయినట్లు అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పార్టీలు బంధుప్రీతి రాజకీయాలు చేస్తున్నాయని, ఇకపై అవి మనుగడ సాగించలేవని అన్నారు.'' ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ తన కుమారుడిని ముఖ్యమంత్రిని చేయాలని పరితపిస్తున్నారు. ఉద్ధవ్ ఠాక్రే ఆయన కొడుకుని సీఎం చేయాలని కలలుగంటున్నారు. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్‌పవార్ ఆయన కుమార్తెను సీఎం పీఠంపై కూర్చోబెట్టాలని చూస్తున్నారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఆయన కుమారుడికి ఆ బాధ్యతలు అప్పగించేందుకు సరైన సమయం కోసం వేచి చూస్తున్నారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ.. ఆమె మేనల్లుడ్ని సీఎంగా చూడాలని



నిరీక్షిస్తున్నారు. సోనియాగాంధీ తన కుమారుడు రాహుల్‌ని ప్రధానిని చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఇలా కుటుంబం కోసం పని చేసే ఏ నాయకులూ ప్రజల కోసం పని చేయలేరు" అని అమిత్‌షా విమర్శించారు.మరోవైపు పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్‌లో భాగమని, దానిని భాజపా ప్రభుత్వం కచ్చితంగా వెనక్కి తీసుకొస్తుందని అమిత్ షా పునరుద్ఘాటించారు. " పాక్ నాయకులు 'పీఓకే' తమదని అంటున్నారు. మరోవైపు పాకిస్థాన్ దగ్గర అణుబాంబు ఉందని కాంగ్రెస్ నేతలు భయపెడుతున్నారు. భాజపా నాయకులు అణుబాంబులకు భయపడరు. కచ్చితంగా పీఓకే ఎప్పటికీ భారత్‌లో భాగంగా ఉంటుంది" అని అమిత్‌షా అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని దోమరియా గంజ్, సంత్ కబీర్ నగర్, అంబేడ్కర్ నగర్ నియోజకవర్గాలకు ఆరో విడతలో భాగంగా మే 25 (శనివారం) పోలింగ్ జరగనుంది.

## పాల్ కూడా 175 అంటున్నాడు ! నా లెక్క ఇదే-రఘురామ జోస్యం..!



అమరావతి: ఏపీలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈసారి నమోదైన రికార్డు పోలింగ్ శాతం అన్ని పార్టీల్లోనూ ధీమా పెంచేసింది. విజయంపై ఎవరూ తగ్గే పరిస్థితి కనిపించడం లేదు.ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు వరకూ వైనాట్ 175 అన్న సీఎం జగన్ కాస్తా గతంలో సాధించిన 151 సీట్ల కంటే ఎక్కువ సీట్లు గెల్చుకోబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు సైతం తాము 140 సీట్ల వరకూ గెల్చుకుంటామని చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమికి 120-125 సీట్లు వస్తాయని రఘురామ ఇప్పటికే జోస్యం చెప్పారు.ఇవాళ మరోసారి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై రఘురామకృష్ణంరాజు స్పందించారు. కోనసీమ జిల్లా అయినవిల్లి, వాడపల్లి ఆలయాన్ని దర్శించుకున్న రఘురామ.. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి మంచి పాలన రావాలని అయినవిల్లిలో దేవుడిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో దుష్ట పరిపాలన అంతమవ్వాలని దేవుణ్ణి కోరుకోవడం జరిగిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాబోతున్నారని ఆయన జోస్యం చెప్పారు.టీడీపీ కూటమి ఈసారి కనీసం 125 సీట్లు గెల్చుకోబోతోందని రఘురామ అంచనా వేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత మరోసారిఈ ఆలయాలకు వచ్చి దర్శనం చేసుకొంటానన్నారు. సీఎం జగన్ వైనాట్ 175 నినాదంపై స్పందిస్తూ.. ఇప్పుడు కేఏ పాల్ కూడా 175కు 175 అంటున్నారని రఘురామ ఎద్దేవా చేశారు. అలాగే మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం ధ్వంసం ఘటనపై స్పందిస్తూ.. ఎన్నికల రిగ్గింగ్ అరికట్టడానికి వెళ్తే ఇన్ని కేసులా అని సాక్షిలో వాపోతున్నారని ఆక్షేపించారు. జూన్ 4వ తేదీన యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ (వైయస్సార్ సీపీ) పార్టీకి పెద్ద కర్మ నిర్వహించబోతున్నామని రఘురామ తెలిపారు.

## పోలింగ్ కేంద్రాల వారీగా డేటాను వెల్లడిస్తే గందరగోళమే: సుప్రీంకు ఈసీ అఫిడవిట్




దిల్లీ: సార్వత్రిక ఎన్నికల వివిధ దశల్లో నమోదవుతున్న పోలింగ్ శాతాలపై కచ్చితమైన అధికారిక సమాచారాన్ని ఎన్నికల సంఘం సకాలంలో ఇవ్వలేకపోవడంపై విమర్శలొస్తున్న విషయం తెలిసిందే.ఈ అంశంపై సుప్రీంకోర్టు లోనూ పిటిషన్ దాఖలైంది. దీనికి కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. ఎన్నికలు జరుగుతున్న సమయంలో పోలింగ్ కేంద్రాల వారీగా డేటాను వెబ్‌సైట్లో వెల్లడిస్తే అది గందరగోళ పరిస్థితులకు దారితీస్తుందని పేర్కొంది. ఈ మేరకు సర్వోన్నత న్యాయస్థానానికి అఫిడవిట్ దాఖలు చేసింది.ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల ప్రథమ, ద్వితీయ దశల పోలింగ్ శాతాలను అధికారికంగా వెల్లడించడంలో తీవ్ర జాప్యం జరగడం, ఆ గణాంకాలను సవరించడంపై సందేహాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే ప్రతి విడతలో పోలింగ్ ముగిసిన 48 గంటల్లోనే కేంద్రాలవారీ ఓటింగ్ శాతాలను ఈసీ వెబ్‌సైట్‌లో ప్రచురించేలా చూడాలని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ సుప్రీంకోర్టు (%ూజ%)లో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం.. ఈసీకి కీలక ప్రశ్నలు సంధించింది. వీటికి వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

**మార్ఫింగ్ ముప్పు..:** ఈ క్రమంలోనే ఈసీ బుధవారం కోర్టుకు 225 పేజీల్లో తమ వివరణ సమర్పించింది. "ప్రతి పోలింగ్ స్టేషన్‌లో పడిన ఓట్ల సంఖ్యను తెలిపే 'ఫామ్ 17సీ' పత్రాన్ని బహిర్గతం చేయాలని నిబంధనల్లో లేదు. ప్రస్తుతం ఈ 17సీ ఒరిజినల్‌ను స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరుస్తున్నాం. కేవలం పోలింగ్ ఏజెంట్‌కు మాత్రమే దాని కాపీని పొందేందుకు అనుమతి ఉంటుంది. అది కూడా వారి సంతకంతో ఇస్తాం. అలా కాకుండా.. పిటిషనర్ కోరినట్లుగా పోలింగ్ కేంద్రాల వారీగా ఓటింగ్ శాతాన్ని బహిరంగంగా ప్రచురిస్తే దాన్ని దుర్వినియోగం చేసే అవకాశముంది. వాటి చిత్రాలను, కౌంటింగ్ ఫలితాలను మార్ఫింగ్ చేసే ప్రమాదం ఉంది. ఈ డేటాను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల ఎన్నికల యంత్రాంగంలో గందరగోళ పరిస్థితులు నెలకొంటాయి. దీని వల్ల మొత్తం ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అపనమ్మకం ఏర్పడుతుంది" అని ఈసీ సమాధానంలో పేర్కొంది. ఈ ఫామ్ 17సీని ఏ సంస్థకు ఇచ్చేందుకు అనుమతులు లేవని స్పష్టం చేసింది.ఇక తొలి రెండు దశల్లో పోలింగ్ శాతాలపై పిటిషనర్ చేసిన ఆరోపణలను కూడా ఈసీ కొట్టిపారేసింది. అవన్నీ అవాస్తవమని, తప్పుదోవ పట్టించేవని ఆరోపించింది. "పోలింగ్ డేటాలో హెచ్చుతగ్గులు ఉన్నట్లు వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవి. 2019లోనూ ఇదే తరహా ఆరోపణలతో పిటిషన్లు దాఖలయ్యాయని చెబుతున్నారు. అందుకు ఒక్క ఉదాహరణ కూడా వారు ప్రస్తావించలేదు. కేవలం అనుమానంతో మాత్రమే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని స్పష్టమవుతోంది" అని ఈసీ పేర్కొంది.ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మొదటి దశ పోలింగ్ ఏప్రిల్ 19న ముగిసినా.. పోలైన ఓట్ల సంఖ్యను 11 రోజుల తరవాత-ఏప్రిల్ 30న ప్రచురించారు. ఏప్రిల్ 26న జరిగిన రెండో దశ పోలింగ్ శాతాన్ని నాలుగు రోజుల తరవాత ప్రచురించారు. పోలింగ్ రోజున ఎన్నికల సంఘం వెల్లడించిన ఓటింగ్ శాతం కన్నా కొంత అధికంగా ఏప్రిల్ 30న గణాంకాలు కనిపించాయి. దీనిపై విమర్శలు రావడంతో.. ఏడీఆర్ ఈ పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యవహారంపై తదుపరి విచారణ మే 24న జరగనుంది.

## పిన్నెల్లి పరారీ.. పోలీసుల అసమర్థతకు నిదర్శనం: ప్రత్తిపాటి



అమరావతి: పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరారీ పోలీసుల అసమర్థతకు నిదర్శనమని తెదేపా నేత ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. నిందితులకే పోలీసులు పహారా కాస్తారని మరోసారి నిరూపించారన్నారు.వివేకా హత్య కేసు నిందితుడు అవినాష్‌ను ఇలానే దగ్గరుండి కాపాడారని ఆరోపిం చారు."ఈసీ ఆదేశించినా అరెస్టు చేయకుండా ఎవరి కళ్లకు గంతలు కడుతున్నారు? జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే పిన్నెల్లిని పోలీసులే విహారయాత్రకు పంపినట్లుంది. ఆయన్ను ఏపీ పోలీసులు అరెస్టు చేయరు. డీజీపీ, పోలీసులు వైకాపా ఆదేశాల మేరకు పనిచేస్తున్నారు. ఈసీ ఇకనైనా వారి నిజస్వరూపం తెలుసుకోవాలి. సీబీఐని రంగంలోకి దించాలి. పిన్నెల్లిని పట్టుకోలేని వారికి చలో మాచర్లను అడ్డుకునే హక్కు ఎక్కడిది? ఆయన్ను తప్పించడంలో మొదట్నుంచీ అధికారుల పాత్ర సుస్పష్టం" అని ప్రత్తిపాటి ఆరోపించారు.

**పిన్నెల్లి దేశం వదిలిపెట్టి వెళ్లారేమో: దేవినేని ఉమ**

'చలో మాచర్ల'ను పోలీసులు అడ్డుకోవడాన్ని తెదేపా నేత దేవినేని ఉమ ఖండించారు. పిన్నెల్లిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆయన దేశం వదిలిపెట్టి వెళ్లారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. ఆయన అదృశ్యం వెనుక ధనుంజయ్‌రెడ్డి ఉన్నారని ఆరోపించారు. కేంద్ర అధికారుల ఆధ్వర్యంలోనే ఓట్ల కౌంటింగ్ జరగాలని డిమాండ్ చేశారు.

# పరీక్షను ప్రతి ఒకరు వినియోగించుకోవాలి

రాయల్ జర్నలిజం( బాపట్ల ) మే 23 : ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఇన్ ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఉద్యోగాలకు ఈనెల 25వ తేదీన బాపట్లలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవిన్యూ అధికారి సి హెచ్ సత్తిబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలో 200 మంది అభ్యర్థులు ఏపీపీఎస్సీ పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. వీరి కోసం సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 నుంచి 11:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 7:30 నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. ఉదయం 8:30 గంటల తర్వాత అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యే జిల్లాలోని అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

# గొర్రెలకు ఉచిత ఇ టీ వ్యాక్సిన్



రాయల్ జర్నలిజం( రామసముద్రం ) మే 23 : మండలం లోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ లోని తిరుమలరెడ్డి పల్లె గ్రామంలో ఇ టి (మాదిగరోగం )ఉచిత టీకాలు పశువైద్యాధికారిని దివ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.పశువైద్య శిబిరంలో గొర్రెలు.మేకలకు టీకాలు వేయడం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ దివ్య మరియు నాగ భూషణం మాట్లాడుతూ గొర్రెలు మేకలు నోటీ చుట్టూ పుండ్లు,దగ్గడం, జ్వరం కాళ్ల వాపు,మేతసరిగ్గా తినకపోవడం ఈలక్షణాలు,టీకాలు వేయడంతో పాటు గొర్రెలు మేకలను శుభ్రంగా కడిగి మంచి ప్రదేశాల్లో ఉంచాలని సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారిని దివ్య,ఏ హెచ్ ఏ నాగభూషణం రైతులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సిద్ధంగా ఉండాలి



రాయల్ జర్నలిజం( బాపట్ల ) మే 23 : ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. ఓట్ల లెక్కింపుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం ఆయన వీక్షణ సమావేశం ద్వారా మాట్లాడారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలు, ఆ కేంద్రంలో నిబంధనల మేరకు టేబుల్స్ ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టేబుల్స్ ఏర్పాటుపై ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా స్ట్రాంగ్ రూముల భద్రత, సి సి కెమెరాలు నిఘా ఉండాలన్నారు. ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థుల సమక్షంలో పారదర్శకంగా ఓట్ల లెక్కింపు జరగాలన్నారు. ప్రతి అంశాన్ని వీడియోగ్రఫీతో చిత్రీకరించాలని ఆయన సూచించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఓట్ల లెక్కింపు సిబ్బంది నియామకం, బ్యారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈసిఐ మార్గదర్శకాల మేరకు జిల్లాలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆయనకు వివరించారు. బాపట్ల జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించామని, అదే మాదిరిగా ఓట్ల లెక్కింపునకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామంటూ జిల్లా కలెక్టర్ నివేదించారు. వీక్షణ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మర్డర్ మిస్టరీని చేదించిన బాపట్ల పోలీసులు



రాయల్ జర్నలిజం ( బాపట్ల ) మే 23 : ఈ నేల 15 వ తేది స్థానిక పాత బస్ స్టాండ్ వద్ద నెల్లూరు పట్టణం లోని వైకుంట పురంకు చెందిన ప్రశాంత్ హత్య కేసును చేది0చామని బాపట్ల డి.ఎస్.పి మురళీ కృష్ణ తెలిపారు. గురువారం స్థానిక పట్టణం పోలీస్ స్టేషన్ వద్ద వేలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల డి.ఎస్.పి మురళీ కృష్ణ మాట్లాడుతూ మృతుడు నాయుడుకుప్పం ప్రశాంత్ మరియు ఏ 1 ముద్దాయి ఐన ఆదిపరెడ్డి క్రిష్ణ రెడ్డి కి మధ్య గల పాత కక్షలే ఈ హత్యకు గల కారణం అని తెలిపారు. పక్కా పథకం ప్రకారం రాత్రి సమయంలో పట్టణ నడిబొడ్డు ఐన పాత బస్ స్టాండ్ సెంటర్ వద్ద ఆదిపరెడ్డి క్రిష్ణ రెడ్డి తన స్నేహితులతో కలిసి కారు లో వచ్చి ప్రశాంత్ ను అతి కిరాతకం గా హత్య చేసినట్లుగా తెలిపారు. అప్పటి నుండి హత్యా యొక్క పూర్వపారాలు దర్యాప్తు చేయగా వీరంతా నెల్లూరు కు చెందిన వారని తెలియడం జరిగిందన్నారు. ప్రశాంత్ తన తండ్రి ని కలిసేందుకు బాపట్ల వచ్చాడన్నా విషయం తెలుసుకున్న నిందితుడు తన స్నేహితులతో కలిసి బాపట్ల కు వచ్చి ప్రశాంత్ కదలికలు తెలుసుకొని సమయం చూసుకొని రేనుమడుగు లక్ష్మయ్య, ద్వారకచర్ల లక్ష్మణ్, పంగా రోహిత్, బెల్లంకొండ అంకయ్య, కొమరిక ఈశ్వర్ లతో కలిసి ప్రశాంత్ ను కత్తులతో దాడి చేసి అతి కిరాతకంగా హత్యా చేసినట్లుగా తెలిపారు. హత్యకు పాల్పడిన వారందరిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని డిఎస్పి తెలిపారు.

# కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లతో సంసిద్ధం



రాయల్ జర్నలిజం (రాయచోటి )మే 23: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రంలో ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి యం. అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వివరించారు. గురువారం విజయవాడలోని సచివాలయం నుండి సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు భద్రతా చర్యలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు రాయచోటి కలెక్టరేట్ నందలి మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి యం. అభిషిక్త్ కిషోర్ తోపాటు డిఆర్వో సత్యనారాయణ రావు హాజరయ్యారు.వీడియో కాన్ఫరెన్స్లో ముందుగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ చిన్న చిన్న సంఘటనలు మినహా అందరి సమిష్టి కృషి, భాగస్వామ్యంతో ఈనెల 13న రాష్ట్రంలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని, అదే స్ఫూర్తితో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి ప్రణాళిక మేరకు పటిష్టమైన ఏర్పాట్లు చేసుకొని కౌంటింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ త్వరితగతిన ఖచ్చితమైన ఫలితాలను ప్రకటించేలా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా ముందస్తుగా పటిష్టమైన భద్రత, బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పాత్రికేయులకు ప్రత్యేకంగా మీడియా సెంటర్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి యం. అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ... పార్లమెంటు అసెంబ్లీ నియోజకవర్గం అన్నింటికి రాయచోటి నందలి సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు. పార్లమెంటు మరియు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కు కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుల్ లను ఏర్పాటు చేశామని, ఈవీఎం స్ట్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ కేంద్రానికి ఈవీఎంలను తీసుకొచ్చే దారిలో సీసీ కెమెరాలు మరియు బ్యారికేడింగ్, కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించేందుకు ఏజెంట్లు అధికారులకు విడిగా బ్యారికేడింగ్ ఏర్పాటు చేశామని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు కౌంటింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రం లో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని, కౌంటింగ్ కేంద్రాలు స్ట్రాంగ్ రూముల వద్ద ప్రత్యేక భద్రత బలగాలను ఏర్పాటు చేశామన్నారు. మీడియా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ మరియు అసెంబ్లీ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ మరియు ఈవీఎంల లో పోలైన ఓట్ల కౌంటింగ్ కొరకు అదనంగా ఏఆర్ఓ లను, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వ లను నియమించడం జరిగిందన్నారు. కౌంటింగ్ నిమిత్తం నియమించిన సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా సాఫీగా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాల ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు కలెక్టరు జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఎలకపల్లె గ్రామంలో బండెమ్మ జాతర



రాయల్ జర్నలిజం(రామసముద్రం ) మే 23 : మండలంలోని ఎలకపల్లె గ్రామంలో గ్రామపెద్దలు గ్రామస్తులు వారిచే బండెమ్మ తిరుణాళ్ళు వైభవంగా జరిగింది. గురు వారం అమ్మ వారికి ప్రత్యేకంగా మహిళలు ఉపవానలతో దీలు.బోనాలు మోసి మొక్కులు చెల్లించు కున్నారు.గ్రామంలో ప్రతి ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేశారు.పచ్చని తోరణాలతో అలంకరణ చేశారు.అనంతరం అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అమ్మ వారికి అలంకరణ చేసి పురవీధుల గుండా అమ్మ వారిని ఊరేగింపు జరిగింది. మంగళ హారతులతో పసుపు కుంకుమలు పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు అమ్మ వారికి జాతరలో గ్రామలోని బంధువుల సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ రామ కోటి జప యజ్ఞం



రాయల్ జర్నలిజం( రామసముద్రం ) మే 23 : మసముద్రం మండలంలోని గుంతల పేట గ్రామంలో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం నందు గురువారం అంగరంగ వైభవంగా శ్రీ రామకోటి జపా యజ్ఞం ప్రారంభించారు. ఉదయం శ్రీ వీరాంజనేయ స్వామికి అభిషేకాలు నిర్వహించి విశేష పూల అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 6 గంటల నుంచి రామకోటి నిర్వహించారు. అనంతరం సాయంత్రం భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నారాయణప్ప,గాట్టప్ప సుబ్రమణ్యం,గ్రామస్తులు నిర్వహకులు ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# చెంబకూరులో పోలీస్ కార్డన్ సెర్చ్



రాయల్ జర్నలిజం( రామసముద్రం ) మే 23 : మండలం లోని చెంబకూరు మేజర్ పంచాయతీ లో ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మదనపల్లి ఎస్సై మోహన్ నాయక్,నిమ్మనపల్లి ఎస్సై స్థానిక పోలీస్ సిబ్బంది తో కార్డాన్ సెర్చ్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాదినం చేసుకోవడం జరిగింది.ఎస్సై చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలం లో పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామాలలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని. గ్రామాల్లోఅందరూ వివాధాలకు దూరంగా ఉండాలని శాంతియుతంగా మెలగాలని జిల్లా మొత్తం పోలీస్ యాక్ట్ అమలులో ఉ ఒదన్నారు.నేర చరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉ ంచడం జరిగిందని.వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని.ఎన్నికల్లో గెలిచినవారు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు టపాసులు కాల్చడానికి అనుమతులు లేదని.ప్రజలకు భరోసా కల్పించేందుకు పోలీస్ కార్డన్ సెర్చ్ నిర్వహించడం జరిగిందని. ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఎవ్వరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్సై చంద్రశేఖర్ పోలీస్ అధికారులు సిబ్బంది హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కౌంటింగ్ సమయంలో అల్లర్లు చేస్తే కఠిన చర్యలు తప్పవు



రాయల్ జర్నలిజం(రామాపురం )మే 23 : రామసముద్రం మండలంలోని కుదురుచీమనపల్లె లో గురువారం రుక్మిణి సత్యభామ శ్రీ వేణుగోపాల స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉట్ల తిరునాళ్ళ తిలకించడానికి ప్రజలు మండల నల్లమూలల నుంచి కాకుండా కర్ణాటక నుంచి కూడా తరలివచ్చారు. కుదర చిమ్మనపల్లి గ్రామం బంధువులతో కళకళలాడింది. భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం గ్రామ పెద్దలు గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి కి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.చుట్టూ పక్కల ప్రాంతాల నుంచి.అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి ఊరేగింపులో మహిళలు ఇంటింటి కర్పూర హారతులు పట్టి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆర్కెస్ట్రా కార్యక్రమాన్ని నిర్వహించారు.

# గౌతమ బుద్ధుడు ఘన నివాళి



రాయల్ జర్నలిజం( బాపట్ల ) మే 23 : మానవులలో కుల ఆధిపత్యాన్ని గౌతమ బుద్ధుడు తీవ్రంగా వ్యతిరేకించాడు. మానవులందరూ సమానులేనని ఆయన నిర్ద్వందంగా ప్రకటించారు.సమాజంలోని మూఢ ఆచారాలు ,అంధ విశ్వాసాలపై గళమెత్తాడు. పీడిత జనుల విముక్తిని ఆయన కాంక్షించారు. ఆ విధంగా బుద్ధుడు తొలి సామాజిక విప్లవకారుడు. ప్రజల భాషయిన పాళీ భాషను ప్రచారమాధ్యమంగా ఎన్నుకున్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటివి భావనలకు తొలిసారిగా ఆయన ప్రాణం పోశారు. హేతువాద దృష్టితో సమాజంలోని సంక్షోభాన్ని ఆయన పరిష్కరించారు. కుల అసమానతలను వ్యతిరేకించి, సంక్షేమ రాజ్యానికి బాటలు వేశారు. బుద్ధ జయంతి సందర్భంగా గురువారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, డిప్యూటీ తహశీల్దార్ కె.శ్రీదేవి, ఎన్నికల డిటి శ్రీనివాసులు, ఆర్ ఐ ఎల్లమంద, సిబ్బంది మణికంఠ,సాగర్, సాయి తదితరులు పాల్గొన్నారు..

# వయోజన బీసీసీ వ్యాక్సిన్ కేంద్రాలను ఆస్మిక తనిఖీ



రాయల్ జర్నలిజం(వాల్మీకిపురం) మే 23 : గుర్రంకొండ మండల పరిధిలో వయోజన బీసీజీ టీకా కేంద్రాలను పరిశీలించారు. ఇందులో వ్యాక్సిన్ వేయు వివరాలను మరియు వ్యాక్సిన్ వేసుకోబడిన ఎలిజిబిలిటీ లిస్టును పరిశీలించారు. , మండలంలోని చెర్లోపల్లి, గుర్రంకొండ సచివాలయాలను, తరిగొండ రామాపురం, సచివాలయంలో తనిఖీ చేశారు. తరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించి రికార్డును పరిశీలించి డాక్టర్ గారికి పలు సూచనలు చేశారు, ఇందులో ముఖ్యంగా హాస్పిటల్ నందు గర్భవతులు డెలివరీ అయ్యేట్టుగా చూసుకోవాలని గర్భవతుల లైన్ లిస్టు ని పలు రికార్డులను పరిశీలించి, ల్యాబ్ నందు పరీక్షల్ని మెరుగుపరుచుకోవాలని, లాట్ టెక్నీషియన్ పనితీరు మార్చుకోవాలని సూచించారు. ఫీల్డ్ నందు ఏఎన్ఎం, ఆశ, ఎమ్మె ఎల్ హెచ్ పి లు వ్యాక్సిన్ మీద అవగాహన కలిగి ఉ ండాలని తెలియజేశారు. ఈనెల23వ తేదీ నుండి వాల్మీకిపురం యూనిట్ వ్యాప్తంగా వయోజనులకు బీసీజీ టీకాల కార్యక్రమం నిర్దేశించిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో వేయడం జరిగింది.అని అడిషనల్ డిస్ట్రిక్ట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శైలజ గారు తెలిపారు. టి.బి.(క్షయ)ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 23వతేదీ నుండి ప్రతి గురువారం 18 ఏళ్లు దాటిన వారిని గుర్తించి వారికి మరియు మధుమేహ వ్యాధిగ్రస్తులకి, ధూమపానం చేయువారికి, టీబి మందులు వాడి తగ్గిన వారికి, టిబి వ్యాధి కుటుంబ సభ్యులకి, 60 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరికి మరియు బాడి మాస్ ఇండెక్స్ 18 లోపు ఉన్నవారికి బీసీజి టీకాను ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ ప్రతి గురువారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో ఉచిత టీకా వినియోగించుకొని టీబీ రహిత భారత దేశంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో గుర్రంకొండ తరిగొండ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ సులక్షణ, డాక్టర్ రవీందర్ నాయక్, డిస్టిక్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చెన్నారెడ్డి, సీనియర్ సూపర్వైజర్ మురళి, శ్రీనివాసులు నాగిరెడ్డి, గుర్రంకొండ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సీతారామయ్యా, సూపర్వైజర్స్ నాగరాజు రమణ నాయక్ ఏఎన్ఎం లక్ష్మీదేవి,వాణి, గంగులమ్మ ఆశ కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ జ్యోతి, చందన, లలిత తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ వివరాలు బయటపెట్టలేమని సుప్రీంకు తేల్చేసిన ఈసీ-మిమ్మల్ని ఎలా నమ్మాలన్న కపిల్ సిబల్!



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా లోక్ సభ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. వివిధ దశల్లో జరుగుతున్న పోలింగ్ ముగియగానే పోలింగ్ శాతాల్ని బహిరంగపర్చడం లేదంటూ ఈసీపై దాఖలైన కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టుకు ఈసీ సమర్పించిన అఫిడవిట్ లో కీలక అంశాల్ని పేర్కొంది.పోలింగ్ శాతాల్ని బూత్ ల వారీగా ప్రజలకు తెలియజేయాల్సిన చట్టపరమైన బాధ్యత తమకు లేదని ఎన్నికల సంఘం తెలిపింది. దీనిపై స్పందించిన ప్రముఖ లాయర్ కపిల్ సిబల్ అలా అయితే ఈసీని ఎలా నమ్మాలని ప్రశ్నించారు.అన్ని పోలింగ్ బూత్ లలో నమోదైన ఓట్ల వివరాలను ప్రజలకు బహిరంగ పేర్చాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్ లో ఈసీ తెలిపింది. ఈ వివరాలు పోటీలో ఉన్న అభ్యర్థులకు, వారి ఏజెంట్లకు తెలిస్తే చాలని పేర్కొంది. ప్రతీ పోలింగ్ బూత్ లో పోలైన ఓట్లను తెలిపే ఫామ్ 17ను ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయడం కుదరదని ఈసీ తేల్చిచెప్పేసింది. ఇందులో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూడా ఉంటాయి కాబట్టి అది అంతిమంగా ఓటర్లలో గందరగోళానికి కారణమవుతుందని తెలిపింది.ప్రతీ దశ ఎన్నికల తర్వాత ప్రతీ బూత్ లో నమోదైన ఓట్ల వివరాలను 48 గంటల్లోకా ఆన్ లైన్ లో పెట్టేలా ఈసీని ఆదేశించాలంటూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టుకు ఈసీ ఈ అఫిడవిట్ సమర్పించింది. ఈసీకి ఇలా ఇవ్వాల్సిన చట్టపరమైన బాధ్యత కూడా ఉందని తెలిపింది. దీనిపై స్పందిస్తూ అలాంటి చట్టపరమైన బాధ్యత తమకు లేదని ఈసీ వివరణ ఇచ్చింది.

# తెలుగు రాష్ట్రాల్లో రుతుపవనాల రాక ముహూర్తం - కానీ, బిగ్ అప్డేట్..!



అమరావతి : ఈ సారి రుతుపవనాలు ముందుగానే వస్తున్నాయి. ఇప్పటికే అండమాన్ తాకిన రుతువపనాలు మే నెలాఖారుకే కేరళను తాకనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆ తరువాత కేరళ నుంచి ఏపీ లోని రాయలసీమ మీదుగా తెలంగాణను చేరుకోవడానికి కనీసం అయిదారు రోజుల సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోకి జూన్ 5 నుంచి 8తేదీల మధ్యన ప్రవేశించే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ అంచనా వేసింది.

**నైరుతి రాక :** జూన్ మొదటి వారంలో తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించనున్నట్లు భారత వాతావరణ శాఖ ప్రకటించింది. నైరుతి రుతుపవన గమనం ఆశాజనకంగా ఉందని జూన్ 11వ తేదీలోపే రాష్ట్రానికి రుతుపవనాలు వస్తాయని అంచనా వేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ ఏడాది రుతుపవనాలు మే నెలాఖారుకే కేరళను తాకనున్నట్లు అధికారులు వివరించారు. ఒకవేళ ఆలస్యమైనా జూన్ రెండో వారంలో రాష్ట్రమంతటా విస్తరిస్తాయని స్పష్టం చేసింది. గతేడాది రుతుపవనాలు కేరళకే జూన్ 11న వచ్చాయని, అందుకే తెలంగాణలో జూన్ 20 తర్వాతే రుతుపవనాలు విస్తరించాయని వివరించింది.

**మారుతున్న వాతావరణం :** ప్రస్తుతం మహాసముద్రాల ఉపరితల ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులన్నీ సానుకూలంగా ఉండడంతో ఈ ఏడాది నైరుతి రుతుపవనాలతో సాధారణ వర్షపాతం నమోదవుతుందని స్పష్టం చేసింది. తెలంగాణలో రానున్న ఐదు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు మే 26 వరకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. మే 22న కుమురం భీమ్ మినహా అన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

**అల్పపీడనంతో అలర్ట్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రేపటికి వాయుగుండంగా మారి...తరువాత తఫాన్ గా మార్పు చెందే అవకాశం ఉంది. ఈ నెల 25న రాత్రి బెంగాల్, బంగ్లాదేశ్ మధ్య తీరం దాటే ఛాన్స్ ఉందని అంచనా వేస్తున్నారు. ఈ తుఫాన్ కు రీమల్ గా నామకరణం చేసారు. దీంతో..నాలుగు రోజులు మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చిరిక జారీ చేసారు. దీంతో..ఏపీలో నేటి నుంచి ఎండలు పెరుగుతాయని...26వ తేదీ నుంచి వడగాల్పులు ఉంటాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# పిన్నెల్లి ఫ్యూచరేంటో చెప్పేసిన ఈసీ- మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచినా..!



అమరావతి : ఏపీలో ఎన్నికల పోలింగ్ సందర్భంగా మాచర్లలో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భవిష్యత్తు ఎలా ఉండబోతోందో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనా తేల్చిచెప్పేశారు.ఈవీఎం ధ్వంసం ఘటనలో వీడియో ఫుటేజ్ లో దొరికిన ఆయనపై ఇప్పటికే మూడు చట్టాల ప్రకారం 10 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ సెక్షన్ల కింద నమోదు చేసిన అభియోగాలు రుజువైతే ఏడేళ్ల జైలుశిక్ష పడే అవకాశముంది.ఈవీఎం ధ్వంసం ఘటనపై ఫిర్యాదు రాగానే ఫుటేజ్ తెప్పించుకుని పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై కేసులు నమోదుకు ఆదేశించిన ఈసీ.. ఆయన్ను అరెస్టు చేసేందుకు పోలీసుల్ని పంపింది. అయితే పిన్నెల్లి కోసం హైదరాబాద్ వెళ్లిన పోలీసులకు ఇంకా ఆయన ఆచూకీ లభించలేదని తెలిసింది. ఇప్పటికే పిన్నెల్లిపై ఎయిర్ పోర్టుల్లో సైతం లుకౌట్ నోటీసులు కూడా జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఇవాళ కాకపోతే రేపు పిన్నెల్లి అరెస్టు కావడం ఖాయం.పిన్నెల్లి అరెస్టు తర్వాత ఆయన్ను కోర్టులో హాజరుపర్చి రిమాండ్ కు పంపడం ఖాయంగా కనిపిస్తోంది. ఆ తర్వాత ఏం జరగబోతోందో సీఈవో ముకేష్ కుమార్ మీనా వెల్లడించారు. పిన్నెల్లిపై అభియోగాలు రుజువైతే ఆయనకు జైలుశిక్ష పడటం ఖాయమన్నారు. అయితే ఇది రెండేళ్లు, అంతకు మించి ఉంటే మాత్రం ఆయనపై అనర్హత వేటు పడుతుందని తెలిపారు. ఆయన ఈసారి ఎన్నికల్లో గెలిచినా రెండేళ్ల జైలుశిక్ష పడితే మాత్రం అనర్హత వేటు వేయాల్సి ఉంటుందన్నారు. అదే జరిగితే తిరిగి మాచర్ల నియోజకవర్గంలో ఉపఎన్నిక నిర్వహించాల్సిన పరిస్థితి ఉంటుందని భావిస్తున్నారు.

# అడ్డంగా దొరికేసిన ప్రశాంత్ కిశోర్- ఎన్నికల అంచనాలు డొల్లతనం..!



అమరావతి : ఏపీలో ఎన్నికలు పూర్తయ్యాయి. ఫలితాల పైన అంచనాలు వెలువడుతున్నాయి. సీఎం జగన్ 2019 కంటే ఎక్కువ సీట్లు గెలుస్తామని ధీమాగా చెప్పుకొచ్చారు. టీడీపీ కూటమి నేతలు గెలుపు పైన విశ్వాసంతో ఉన్నారు.ముఖ్యమంత్రి జగన్ ఐ ప్యాక్ టీం తో సమావేశం సమయంలో ప్రశాంత్ కిశోర్ ఊహించని సీట్లు వస్తాయని పేర్కొన్నారు. దీనికి పీకే కౌంటర్ ఇచ్చారు. చంద్రబాబు సీఎం అవుతారని చెప్పారు. ఇదే సమయంలో ప్రశాంత్ కిశోర్ ఎన్నికల అంచనాల విషయంలో అడ్డంగా దొరికిపోయారు.

**పీకే అంచనాలు :** ఏపీ ఎన్నికల్లో గెలుపు ఎవరికి దక్కుతుంది అనేది ఇప్పుడు ఉత్కంఠ పెంచుతుంది. వైసిపి, టిడిపి కూటమి గెలుపు పైన ధీమాగా ఉన్నాయి. 2019 ఎన్నికల్లో వైసీపీ గెలుపులో కీలక పాత్ర పోషించిన ప్రశాంత్ కిషోర్ ఇప్పుడు చంద్రబాబు వైపు చేరారు. ఎన్నికల్లో జగన్ ఓటమి ఖాయమని ప్రశాంత్ కిషోర్ చెబితూ వచ్చారు. ప్రశాంతి కిషోర్ వ్యాఖ్యల పైన జగన్ స్పందించారు. పీకే ఊహించని సీట్లను ఈసారి వైసిపి గెలవబోతుందని ధీమాగా చెప్పారు. మరోసారి చంద్రబాబు గెలుపు ఖాయం అంటూ చెప్పుకొచ్చారు.

**గతంలో చెప్పిన జోస్యం :** తాజాగా సీనియర్ జర్నలిస్ట్ కరణ్ థాపర్ ఇంటర్వ్యూకు పీకే హాజరయ్యారు. అందులో భాగంగా గతంలో పీకే చెప్పిన ఎన్నికల ఫలితాలు పై కరణ్ థాపర్ ప్రశ్నించారు. హిమాచల్ ప్రదేశ్ లో కాంగ్రెస్ ఓడిపోతుందని, తెలంగాణలో టిఆర్ఎస్ గెలుస్తుందని గతంలో పీకే చెప్పిన అంశాలను గుర్తు చేశారు. దీంతో ప్రశాంత్ కిషోర్ అసహనం వ్యక్తం చేశారు. తాను అలా చెప్పినట్టు వీడియో రికార్డులు ఉంటే చూపించాలని డిమాండ్ చేశారు. ఎవరో రాసుకున్న దానికి కాను బాధ్యున్ని కాదని సమాధానం ఇచ్చారు. ఎన్నికల ఫలితాలు జోస్యంపై అంత ధీమాగా ఎలా చెప్పగలరని కరణ్ ప్రశ్నించారు. ఈ విషయాన్ని వదిలేసి మరో ప్రశ్నకు వెళ్లాలంటూ పీకే సమాధానం దాటవేశారు.

**ఏపీలో ఏం జరుగుతోంది:** దీంతో ఇప్పుడు ఏపీలో ప్రశాంత్ కిషోర్ చెప్పిన ఎన్నికల జోష్యం పైన చర్చ మొదలైంది. ప్రశాంత్ కిషోర్ గత మూడు నెలల కాలంగా టిడిపితో టచ్ లో ఉన్నారు. పోలింగ్ ముందు రోజు సైతం ఒక యూట్యూబ్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జగన్ ను కార్నర్ చేశారు. జగన్ పైన ప్రజా వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉందని చెప్పుకొచ్చారు. ఇక పోలింగ్ తర్వాత మరోసారి పీకే గతంలో చెప్పిన విధంగానే జగన్ ఓటమి ఖాయం అని వ్యాఖ్యానించారు. దీనిపైన వైసీపీ నేతలు సీరియస్ గా స్పందించారు. ఇక జూన్ 4న వెల్లడి కానున్న ఫలితాల్లో ప్రశాంత్ కిషోర్ జోస్యం నిజమవుతుందా.. జగన్ ధీమా నిలబడుతుందా అనేది స్పష్టం కానుంది.

# నవ భారత్ 'ప్రమాదకర సంస్థ'.. ఐరాస వేదికగా భారత్‌పై పాక్ కారు కూతలు

న్యూఢిల్లీ : ఐక్యరాజ్యసమితి వేదికగా భారత్‌పై మరోసారి పాకిస్తాన్ కారు కూతలు కూసింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో పాక్ శాశ్వత రాయబారి మునీర్ అక్రమ్ భారత్‌పై మాటల దాడికి దిగారు.నవ భారత్ ను ప్రమాదకర సంస్థగా అభివర్ణించారు.పాక్ సహా పలు దేశాల్లో జరిగిన లక్షిత హత్యల్లో(టార్గెటెడ్ కిల్లింగ్స్) భారత్ ప్రమేయం ఉందని ఆయన ఆరోపించారు. పాకిస్తాన్‌లో ఉగ్రవాదుల మిస్టరీ మరణాల వెనక భారత్ ప్రమేయం ఉందంటూ గతంలో బ్రిటన్‌కు చెందిన 'ది గార్డియన్' డైలీ ప్రచురించిన సంచలన కథనం ఆధారంగా మునీర్ అక్రమ్ ఈ కామెంట్స్ చేశారు. భారత్ చర్యల గురించి భద్రతా మండలి, జనరల్ అసెంబ్లీలకు పాకిస్తాన్ విదేశాంగ శాఖ సమాచారాన్ని అందించిందన్నారు. పాక్, కెనడా, అమెరికాల్లోనూ భారత్ ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు.నవ భారతం ప్రమాదకర సంస్థ అని మునీర్ అక్రమ్ పేర్కొన్నారు. "భారత్ బలమైన ప్రభుత్వం ఉంది. ఉగ్రవాదులు తమ సొంత దేశాలకు పారిపోయినా.. అక్కడికి వెళ్లి మరీ వారిని హతమారుస్తాం'' అంటూ గతంలో మోడీ కామెంట్స్ చేశారు. 2023లో భారతదేశం లక్షిత హత్యలు చేసిందని.. 15 మంది మరణాల్లో భారత ప్రభుత్వ ప్రమేయం ఉందని నిఘా వర్గాలను ఉటంకిస్తూ 'ది గార్డియన్' డైలీ కథనంలో ప్రస్తావించింది. ఇక ఖలిస్థానీ అనుకూల నాయకుడు హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత ప్రభుత్వానికి ప్రమేయం ఉందని కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో గతంలో ఆరోపించారు. భారత నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) నియమించిన ఉగ్రవాదే నిజ్జర్‌ను హత్య చేశాడని పేర్కొన్నారు. ఈకేసులో ఇప్పటివరకు నలుగురు భారత పౌరులను కెనడా అధికారులు అరెస్టు చేశారు. అయితే ఈ హత్యలో తమ దేశం ప్రమేయం ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని భారత్ స్పష్టం చేసింది.

# ఓరుగల్లుకు ఎయిర్ జర్నీ.. విమానాల ల్యాండింగ్‌కు సన్నద్ధం



అమరావతి : వరంగల్ విమానాశ్రయ నిర్మాణానికి చిక్కుముడులు వీడుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్? పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాంతీయ విమానాశ్రయం విషయంలో ఎయిర్? పోర్ట్స్? అథారిటీ వేచి చూసే ధోరణితో ఉంది. వరంగల్ విమానాశ్రయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించటంతో ఏఏఐ అధికారుల్లో కదలిక వచ్చింది. ఎయిర్‌పోర్ట్స్ నిర్మాణానికి వీలుగా ప్రస్తుతం ఉన్న 706 ఎకరాల భూమికి అదనంగా 253 ఎకరాలు కేటాయిస్తూ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందుగానే మునుపటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**సర్వేపై రాని స్పష్టత..**

హైదరాబాద్‌కు చెందిన జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్‌తో పాటు రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి కూడా అనుమతులు తీసుకోవాల్సి ఉందని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. భూమి కేటాయింపు ఉత్తర్వుల నేపథ్యంలో ఏఏఐ అధికారులు వరంగల్ విమానాశ్రయం పరిస్థితులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ఎలాంటి సమాచారం లేకపోవటంతో అయోమయం నెలకొంది. విమానాశ్రయ నిర్మాణం కోసం పరిశీలన చేశారా? మరేదైనా కారణాలతో సర్వే చేశారా? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

**విస్తరణకు 1200 కోట్ల ఖర్చు అంచనా..**

విమానాశ్రయాన్ని దశల వారీగా విస్తరించాలని మునుపటి ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత ఏటీఆర్ స్థాయి చిన్న విమానాల రాకపోకలకు వీలుగా నిర్మించాలనుకున్నారు. దీనికి అనుగుణంగా మునుపటి ప్రభుత్వం 253 ఎకరాలను కేటాయించింది. ఏఏఐ అధికారులు కనీసం 400 ఎకరాలు కేటాయించాలని తమ నివేదికలో వెల్లడించారు. విస్తరణకు సుమారు రూ. 1,200 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. అంత మొత్తాన్ని ఖర్చు చేసేందుకు అప్పటి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయలేదని అధికారులు చెబుతున్నారు. రూ. 400 కోట్ల నుంచి రూ. 500 కోట్లతో విమానాల రాకపోకలకు ఏర్పాట్లు చేయాలని చెప్పడమే కాకుండా, ఆ మేరకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు స్పష్టం చేసింది. నిజానికి ఒకేసారి నిర్మాణాన్ని చేపట్టడమే అన్ని రకాలుగా ఉపయుక్తంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

**సమీక్ష చేయనున్న ఎయిర్‌పోర్ట్ అథారిటీ బృందం**

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి సుముఖత వ్యక్తం చేసినా, ఏ స్థాయిలో అన్నది నిర్ణయించాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్? అమల్లో ఉంది. అది ముగిసిన తర్వాత ఈ విషయంపై సీఎం రేవంత్? రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. పూర్తి స్థాయిలో అభివృద్ధా? లేక మునుపటి ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ముందుకు వెళ్లడమా? అన్నది అప్పుడు ఖరారవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనిపై సమీక్షించేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల బృందం త్వరలో రాష్ట్రానికి రానున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ బృందం వరంగల్?లోని ఎయిర్? స్ట్రిప్?ను పరిశీలించడంతో పాటు ఉన్నతాధికారులతో చర్చలు నిర్వహించాలని నిర్ణయించింది.

# మాచర్ల, తాడిపత్రి, చంద్రగిరి అల్లర్లతో ఈసీ అలర్ట్- మరో కీలక నిర్ణయం తీసుకున్న ఎన్నికల సంఘం



అమరావతి : ఆంధ్రప్రదేశ్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఎన్నికల అనంతరం మూడు ప్రాంతాల్లో విధ్వంసాలు జరిగాయి. హత్యాయత్నాలు, ఈవీఎంల ధ్వంసం, ప్రత్యర్థులపై దాడులతో మాచర్ల, తాడిపత్రి, చంద్రగిరి దద్దరిల్లిపోయింది.ఈ దాడులను అదుపు చేయడానికి ఎన్నికల సంఘం ప్రత్యేక టీమ్లను రంగంలోకి దింపాల్సి వచ్చింది.ప్రస్తుతానికి అన్ని ప్రాంతాల్లో పరిస్థితి అదుపులోకి వచ్చినప్పటికీ కౌంటింగ్ తర్వాత పరిస్థితి ఇంకా అదుపు తప్పే ప్రమాదం ఉందని కూడా ఎన్నికల సంఘానికి సమాచారం ఉంది. ఈ మూడు ప్రాంతాలతోపాటు ఇంకా చాలా ప్రాంతాల్లో గొడవలు జరిగే ఆస్కారం ఉందని ఇంటెలిజెన్స్ అలర్ట్ ఇచ్చింది. దీంతో మరింత అప్రమత్తంగా ఉంటోన్న ఎన్నికల సంఘం మరో కీలక నిర్ణయం తీసుకుంది.లోక్ సభ ఎన్నికల లెక్కింపు జూన్ నాలుగున జరగనుంది. అదే రోజు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కూడా ఉంది. అందుకే ముందు జాగ్రత్తగా ఎన్నికల సంఘం భారీగా బలగాలను మోహరించడంతోపాటు మరికొన్ని ఆంక్షలు విధిస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలో ర్యాలీలు, ఊరేగింపులపై నిషేధం విధించింది. వాటితోపాటు బాణసంచా విక్రయాలపై కూడా ఆంక్షలు పెట్టింది.రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదన్న ఎన్నికల సంఘం ఇప్పటికే గొడవలతో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉన్న ప్రాంతాల్లో 144 సెక్షన్ కొనసాగిస్తోంది. చంద్రగిరి, మాచర్ల, తాడిపత్రి పోలీసు నిఘాలో ఉంది.ఎన్నికల సంఘం చెప్పిన రూల్స్ పాటించకుంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అవసరమైతే అతిక్రమించే వాళ్లు కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అలాంటి పరిస్థితి తెచ్చుకోవద్దని అధికారులు సూచిస్తున్నారు.వచ్చే నెల ఆరో తేదీ వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి. తయారీదారులు, అమ్మకందారులు కూడా జాగ్రత్తగ ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా పార్టీలతోపాటు ప్రజలు సహకరించాలని కోరుతున్నారు. ఈ ఆదేశాలను అల్లఘించిన వారిపై ఐపిసి సెక్షన్ 436 కింద కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇస్తున్నారు.

# పాలస్తీనాను దేశంగా గుర్తించిన ఐర్లాండ్, నార్వే, స్పెయిన్.. ఇజ్రాయిల్ కీలక నిర్ణయం..



న్యూఢిల్లీ : ఇజ్రాయిల్‌కి వ్యతిరేకంగా పాలస్తీనాకు మద్దతుగా పాశ్చాత్య దేశాలు కీలక ఎత్తుగడను తీసుకున్నాయి. ఇప్పటికే అమెరికా, ఇతర యూరప్ దేశాల్లో పాలస్తీనాకు మద్దతుగా విద్యార్థులు పలు యూనివర్సిటీల్లో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నారు.ఇదిలా ఉంటే, తాజాగా ఐర్లాండ్, నార్వే,స్పెయిన్ దేశాలు పాలస్తానాను అధికారికంగా ఒక దేశంగా గుర్తించాయి. గాజాలో ఇజ్రాయిల్-హమాస్ మిలిటెంట్లకు తీవ్రంగా యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. ఈ నిర్ణయంపై ఇజ్రాయిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఐర్లాండ్, నార్వేల్లోని తన రాయబారుల్ని వెంటనే వెనక్కి రావల్సిందిగా ఆదేశించింది.బుధవారం ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి ఇజ్రాయిల్ కాట్జ్ మాట్లాడుతూ.." నేను ఐర్లాండ్, నార్వేలకు స్పష్టమైన, నిస్సందేహమైన సందేశాన్ని పంపుతున్నాను. ఇజ్రాయిల్ తన సార్వభౌమత్వాన్ని బలహీనపరిచే, దాని భద్రతకు అపాయం కలిగించే వారి పట్ల మౌనంగా ఉండదు" అని అన్నారు. పాలస్తానాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తూ ఆ దేశాలు తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో ఐర్లాండ్, నార్వేలోని ఇజ్రాయిల్ రాయబారుల్ని తక్షణమే రీకాల్ చేయాల్సిందిగా ఆదేశించినట్లు వెల్లడించారు. ఇదిలా ఉంటే స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ మాట్లాడుతూ మే 28 నుంచి తమ దేశం కూడా పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించిందన్నారు, అయితే దీనిపై స్పెయిన్‌కి ఇజ్రాయిల్ వార్నింగ్ ఇచ్చింది."ఐరిష్- నార్వేజియన్ మూర?త్వం మమ్మల్ని నిరోధించలేదు. మా లక్ష్యాలను సాధించాలని నిర్ణయించుకున్నాము. మా పౌరుల భద్రతను పునరుద్ధరించడం, హమాస్‌ని కూల్చివేయడం, బందీలను ఇంటికి తీసుకురావడం మా లక్ష్యం, వీటి కంటే న్యాయమైన కారణాలు లేవు" అని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి అన్నారు. అయితే, మధ్యప్రాచ్యంలో శాంతికి తమ నిర్ణయం దోహదపడుతుందని పాలస్తీనాను దేశంగా గుర్తించిన నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ దేశాలు చెబుతున్నాయి. మరోవైపు యూరోపియన్ యూనియన్ దేశాలు స్లోవేకియా, మల్టాలు కూడా శాశ్వత శాంతి కోసం రెండు-దేశాల పరిష్కారం అవసమని చెప్పింది. ఐక్యరాజ్యసమితిలోని 193 సభ్యదేశాలలో మొత్తం 143 పాలస్తీనా దేశాన్ని గుర్తించాయి. పాలస్తీనా రాజ్యాన్ని అధికారికంగా గుర్తించని దేశాలలో UK మరియు US ఉన్నాయి.

# వోటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఒక్కరికి కోనా కృతజ్ఞతలు



రాయల్ జర్నలిజం( బాపట్ల ) మే 23 : ఎంతో ప్రశాంతమైన పండుగ వాతావరణంలో మండు ఎండను సైతం లెక్కచేయకుండా తమ వోటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఒక్కరికి బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు కోనా రఘుపతి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం తన స్వగృహం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో కోనా రఘుపతి మాట్లడుతూ ఎంతో సమర్ధవంతంగా విధులు నిర్వహించి ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. మాచర్ల లో జరిగిన సంఘటనకు సంబంధించి పిన్నేలి రామకృష్ణ రెడ్డి విడియోలు ఎన్నికల కమీషన్ యొక్క ఆదేశాలతో బయటకు వచ్చాయా లేకపోతే క్రింధస్థాయి అధికారులను ప్రలోభపెట్టి ఈ వీడియోలను బయటకు పంపించారా అనే విషయం తెలియాల్సి ఉందన్నారు. చర్యకు ప్రతి చర్య చోటు చేసుకుందే తప్ప రామకృష్ణ రెడ్డి తప్పు ఏమి లేదన్నారు అదే విధంగా పేరం గరుడాచలం నాయుడు ఎంతో సదుద్దేశంతో పేదలకు ఉపయోగపడాలనే దృక్పధంతో దానం చేసిన స్థలాన్ని ఎవరికో దారాదత్తం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఎన్నికల నిబంధనల కారణంగా తూర్పు సత్రం స్థలం యొక్క అభివృద్ధి పనుల నిమిత్తం విడుదల చేసిన నిధులను ఎన్నికలు పూర్తైన వెంటనే వినియోగాపరచి పేరం గరుడా చలం నాయుడు ఆశయాలను సాకారం చేస్తామన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ వారికి తూర్పు సత్రం స్థలం లో కొంత భాగాన్ని కేటాయించడాన్ని తీవ్రంగా ఖండించడంతో పాటుగా ఈ విషయం పై ఇప్పటికే దేవాదాయ శాక కమీషనర్ తో మాట్లాడి ఈ ప్రక్రియను ఆపాలని కోరినట్లుగా తెలిపారు. దేవాదాయశాక కమీషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. అవసరమైతే కోర్టు ను సైతం ఆశ్రయించి తూర్పుసత్రం స్థలం ను ఎవ్వరికి దారాదత్తం కాకుండా కాపాడతామన్నారు. గతంలో తూర్పుసత్రం స్థలంలో కొంత భాగాన్ని మెయిన్ రోడ్డు నిర్మాణానికి తాత్కాలికంగా కేటాయిచడం జరిగిందని, పనులు పూర్తయిన వెంటనే వారు కాళీ చేయడం జరిగిందని తెలిపారు. రానున్న రోజుల్లో తూర్పు సత్రం ను ప్రజల సహకారంతో మరింతగా అభివృద్ధి చేస్తానని తెలిపారు.

# ఏపీలో కౌంటింగ్ టెన్షన్- పలు చోట్ల ఆంక్షలు-అనంతలో క్రాకర్స్ బ్యాన్..!

అమరావతి : ఏపీలో ఈసారి సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా చెలరేగిన హింసాత్మక ఘటనలు కౌంటింగ్ సందర్భంగా కూడా రిపీట్ అయ్యే అవకాశాలు ఉన్నాయన్న నిఘా వర్గాల హెచ్చరికలు టెన్షన్ పెంచేస్తున్నాయి.ముఖ్యంగా పల్నాడు, రాయలసీమ ప్రాంతాల్లో ఈసారి ఫలితాల్లో తేడా వస్తే రాజకీయ పార్టీలు రెచ్చిపోయే ప్రమాదం ఉందన్న హెచ్చరికల మధ్య పోలీసులు అప్రమత్తం అవుతున్నారు. దీంతో పలు జిల్లాల్లో నిషేధాజ్ఞలు విధిస్తున్నారు.రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పల్నాడు, అనంతపురం, తిరుపతి జిలాల్లో హింస చెలరేగింది. దీన్ని వెంటనే అదుపులోకి తీసుకురావడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారు. ఆ తర్వాత ఈసీ సీరియస్ కావడంతో మొక్కుబడిగా కేసులు పెట్టి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నించారు. చివరికి సీఈసీ ఆదేశాలతో సిట్ ఏర్పాటయ్యాక కూడా పోలీసులు హింసాత్మక ఘటనలపై చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.ఈ క్రమంలోనే పల్నాడు, తిరుపతి జిల్లాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ కోరుతూ అంబటి రాంబాబు, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వంటి నేతలు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇవాళ హైకోర్టు విచారణ జరపనుంది. మరోవైపు ఈ ఘటనల ప్రభావం కౌంటింగ్ పైనా



ప్రభావం చూపే అవకాశం ఉండటంతో పలు జిల్లాల్లో 144 సెక్షన్ విధిస్తున్నారు. కౌంటింగ్ పూర్తయి ఫలితాల ప్రకటన పూర్తయ్యే వరకూ ఇది అమల్లో ఉండబోతోంది.అలాగే అనంతపురం జిల్లాలో ఫైర్ క్రాకర్స్ వాడకంపైనా నిషేధం విధించాలని ఎస్పీ గౌతమీశాలి చేసిన సిఫార్సును కలెక్టర్ ఆమోదించారు. ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత వరకూ ఈ నిషేధం అమల్లో ఉంటుందని ప్రకటించారు. అలాగే పలు జిల్లాల్లో ఎన్నికల తర్వాత గెలిచిన అభ్యర్థులు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు చేపట్టకుండా ఆంక్షలు విధిస్తున్నారు. వీటితో పాటు అప్పటి పరిస్థితులను బట్టి మరిన్ని ఆంక్షలు విధించే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

# ఓట్ల కౌంటింగ్ ఓపెనింగ్‌లో ఆ పార్టీకే ఫుల్ కౌంట్ - ఆ తరువాత..!



అమరావతి : ఏపీలో అధికారం దక్కేదెవరికి. పోలింగ్ ముగిసిన తరువాత ఫలితాల పైన మరింత ఉత్కంఠ పెరుగుతోంది. సీఎం జగన్ 2019లో గెలిచిన సీట్ల కంటే ఎక్కువ గెలుస్తామని ధీమాగా చెబుతున్నారు.టీడీపీ కూటమి నేతలు గెలుపు పైన ఆశతో ఉన్నారు. ఇక..సర్వే సంస్థలు పోస్ట్ పోల్ సర్వేల పేరుతో ఓటర్ల పల్స్ తెలుసుకొనే ప్రయత్నం చేస్తున్నాయి. ఇక..ఎన్నికల ఓట్ల లెక్కంపు సమయంలో మొదలయ్యే ట్రెండ్స్ పైన ఇప్పటికే అంచనాలు మొదలయ్యాయి.

**పెరిగిన పోలింగ్ శాతం:** ఏపీలో 2019 కంటే రెండు శాతం పోలింగ్ పెరిగింది. పురుషుల కంటే మహిళలు ఎక్కువ సంఖ్యలో ఓట్లేసారు. అర్బన్ కంటే గ్రామీణ ప్రాంతంలో పోలింగ్ శాతం ఎక్కువగా నమోదైంది. దీంతో..వైసీపీ గెలుపు తమదే అంటూ ధీమాగా ఉంది. టీడీపీ కూటమి నేతలు ప్రభుత్వం పైన అన్ని వర్గాల్లో వ్యతిరేకత ఉందని..తాము గెలవటం ఖాయమని విశ్వాసంతో కనిపిస్తున్నారు. ఇక...ఏపీలో మొత్తంగా 3,33,40,333 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 1.64 కోట్ల మంది కాగా, మహిళా ఓటర్ల సంఖ్య 1.69 కోట్ల మంది ఉన్నారు. వీరి ఓటింగ్ పైన పార్టీలు భిన్న అంచనాలతో ఉన్నాయి.

**పోస్టల్ బ్యాలెట్ అనుకూలత :** ఇక, హెూరా హెూరీ పోరులో పోస్టల్ బ్యాలెట్, హెూమ్ ఓటింగ్ ఓట్ల పైన పార్టీలు ఆశలు పెట్టుకున్నాయి. ఎన్నికల్లోని విధుల సిబ్బంది 4,44,218 మంది ఓటు వేయగా.. 85 ఏళ్ల పైబడిన వారు 13,700 మంది ఓట్లు వేసారు. దివ్యాంగులు 12,700 మంది ఉండగా..ఇతర అత్యవసర సేవల్లోని వారు 27,100 మంది ఓట్లు వేసారు. వీరిలో ఎవరికి ఎన్ని ఓట్లు పడ్డాయనేది లెక్కలు మొదలయ్యాయి. ప్రభుత్వం పైన ఉద్యోగ వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయని...మెజార్టీ ఓట్లు తమకే పడతాయని టీడీపీ నేతలు అంచనా వేస్తున్నారు. అదే విధంగా దివ్యాంగుల విషయంలోనూ రెండు పార్టీలు నమ్మకం పెట్టుకున్నాయి.

**తొలి గంటలోనే ట్రెండ్స్ క్లారిటీ :** జూన్ 4న కైంటింగ్ ప్రారంభమైన తరువాత తొలుత పోస్టల్ బ్యాలెట్ ద్వారా వచ్చిన ఓట్లను లెక్కిస్తారు. దీనికి కొనసాగింపుగా హెూమ్ ఓటింగ్ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. దీంతీ..ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం మేరకు ఒక పార్టీకి తొలి అరగటం ట్రెండ్స్ కౌంటింగ్ లో అనుకూలంగా ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. పోస్టల్ బ్యాలెట్ పూర్తయిన తరువాత ఈవీఎం కౌంటింగ్ మొదలు అవుతుంది. అప్పటి నుంచి 15-20 నిమిషాల్లో తొలి రౌండ్ ఫలితాలు బయటకు వస్తాయి..అప్పటి నుంచి అసలు ఓట్ల కౌంటింగ్ లెక్కలు..ట్రెండ్స్..పార్టీల లీడ్స్ కొనసాగుతాయి. ఉదయం 10-10.30 గంటల మధ్యలో ఏ పార్టీకి అనుకూల ఫలితాలు వస్తున్నాయనేది దాదాపు స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# 'ఏఐ'ని మనుషుల్లా చూడడం ఆపాలి: సత్య నాదెళ్ల



వాషింగ్టన్: టెక్ కంపెనీలు ఏఐపై లోతైన పరిశోధనలు చేపడుతున్నాయి. ఈ క్రమంలో ఏఐ సాధనాల్లో మనుషుల తరహా లక్షణాలను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి.నవ్వడం, పాడటం, వివిధ గొంతులతో మాట్లాడగలిగే పర్సనల్ అసిస్టెంట్‌ను ఇటీవల ఓపెన్ఏఐ ఆవిష్కరించింది. అయితే, ఈ తరహా ప్రయోగాలపై మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏఐను మనుషుల్లా భావించడం ఆపాలని సూచించారు.ఏఐలో మనుషుల తరహా లక్షణాలను తీసుకురావాలనే ఆలోచన సరికాదని తాను భావిస్తున్నట్లు నాదెళ్ల వెల్లడించారు. అలాగే ఏఐని ఒక సాధనంగా మాత్రమే ట్రీట్ చేయాలని మనుషులకు ఉపయోగించినట్లుగా నామవాచకాలు, సర్వనామాలు వాడడంపై కూడా ఆయన భిన్నంగా స్పందించారు. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అనే పదజాలంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దీన్ని 'డిఫరెంట్ ఇంటెలిజెన్స్'గా వ్యవహరించి ఉండాల్సిందని సూచించారు. మనుషులకు మాత్రమే 'ఇంటెలిజెన్స్' ఉంటుందని.. ప్రత్యేకంగా దాన్ని ఆర్టిఫిషియల్‌గా పొందాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.ఏఐతో పూర్తిగా వాణిజ్యపరమైన సంబంధమే ఉండాలని నాదెళ్ల సూచించారు. అవసరమైనప్పుడు సేవలందించే సాధనంగా మాత్రమే ఉపయోగించుకోవాలని తెలిపారు. మనుషుల మధ్య బంధాన్ని రీప్లేస్ చేసేలా అది ఉండకూడదన్నారు.

# రాష్ట్రానికి లోక్ సభ సీట్లు ఎలా లెక్కిస్తారు.. అధిక పార్లమెంట్ సీట్లు ఎక్కడంటే..



న్యూఢిల్లీ : భారతదేశ ప్రజాస్వామ్యంలో అతిపెద్ద ఓట్ల జాతర కొనసాగుతోంది. ఇప్పటి వరకు ఐదు దశల్లో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు చాలా మంది తన నియోజకవర్గ అభ్యర్థుల భవితవ్యాన్ని ఈవీఎంలలో భద్రపరిచారు. 18వ లోక్‌సభ సభ్యులను ఎన్నుకునేందుకు మే 25న దశలో ఓటింగ్ జరగనుంది. యూపీలో అత్యధికంగా 80 లోక్‌సభ స్థానాలు ఉండగా, లడఖ్‌లో ఒక్క లోక్ సభ సీటు మాత్రమే ఉండటంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరి, ఈ సీట్ల సంఖ్యను ఎలా నిర్ణయిస్తారు? ఈ విధంగా రాష్ట్రంలోని అసెంబ్లీ స్థానాల సంఖ్యను నిర్ణయిస్తారో ఇప్పుడు పూర్తి వివరాలు తెలుసుకుందా.భారతదేశంలో లోక్‌సభ, శాసనసభ సభ్యుల సంఖ్య అక్కడి జనాభా ప్రాతిపదికన నిర్ణయించబడుతుంది. స్వాతంత్ర్యానంతరం మొదటి లోక్‌సభ ఏర్పడే సమయంలో, గరిష్టంగా లోక్ సభ సభ్యుల సంఖ్య 500గా నిర్ణయించబడింది. అంటే దేశవ్యాప్తంగా 500 మంది లోక్‌సభ ఎంపీలు ఉన్నారు. ఒక రాష్ట్రంలోని లోక్‌సభ స్థానాల సంఖ్యను దాని జనాభా ఆధారంగా నిర్ణయించారు. తరువాత, గరిష్ట సభ్యుల సంఖ్య 552 కి పెరిగింది, అందులో ఇద్దరు సభ్యులు ఆంగ్లో-ఇండియన్ కమ్యూనిటీకి చెందినవారు. వారిని కేంద్ర ప్రభుత్వ సలహా మేరకు రాష్ట్రపతి నామినేట్ చేశారు. ఈ సభ్యుల సంఖ్య 1971 జనాభా లెక్కల ఆధారంగా నిర్ణయించబడింది. అప్పట్లో ప్రతి దశాబ్దానికి సంబంధించిన జనాభా లెక్కల ఆధారంగా సభ్యుల సంఖ్యను నిర్ణయించేవారు.అయితే, 104వ రాజ్యాంగ సవరణ చట్టం-2019 ద్వారా ఆంగ్లో-ఇండియన్ సభ్యుల వ్యవస్థ రద్దు చేయబడింది. కొత్త విధానం 2020 జనవరిలో అమలులోకి వచ్చింది. ప్రస్తుతం లోక్‌సభలో 543 మంది సభ్యులు ఉన్నారు, ఇది గరిష్టంగా 550 వరకు ఉండవచ్చు. అదే సమయంలో, లోక్‌సభలో గరిష్ట స్థానాలను పొందడానికి రాష్ట్రాల మధ్య పోటీ కారణంగా జనాభా నియంత్రణ ప్రభావితం కావడం ప్రారంభమైంది. కాబట్టి ఈ ప్రక్రియ 1976లో రాజ్యాంగ సవరణ ద్వారా నిలిపివేయబడింది. 84వ రాజ్యాంగ సవరణ (2001) ద్వారా తదుపరిసారి 2026లో లోక్‌సభ సభ్యుల సంఖ్యను నిర్ణయించాలని నిర్ణయించారు.

**సీట్ల పంపకంలో తేడా వచ్చింది..**

అందుకే వాస్తవంలో ప్రస్తుతం జనాభా ప్రాతిపదికన సభ్యుల పంపిణీ సరిగ్గా కనిపించడం లేదు. ఉత్తరప్రదేశ్, బీహార్‌ల ఉమ్మడి జనాభా దేశ మొత్తం జనాభాలో 25.1 శాతం. అయినప్పటికీ, యుపిలో కేవలం 80 సీట్లు, బీహార్‌లో 40 సీట్లు ఉన్నాయి. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటకల మొత్తం జనాభా దేశ జనాభాలో 21 శాతం కాగా, వారికి లోక్‌సభలో 129 సీట్లు ఉన్నాయి. సభ్యుల సంఖ్య పెరగకపోవడంతో ప్రస్తుతం నియోజకవర్గాల సరిహద్దులు మాత్రమే మారుతున్నాయి. ఇందుకోసం జనాభా లెక్కల ఆధారంగా ప్రతి దశాబ్దానికి ఒక సరిహద్దు డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తారు. గతంలో ఈ కమిషన్ లోక్‌సభ స్థానాల సంఖ్యను కూడా నిర్ణయించేది.

**డీలిమిటేషన్ కమిషన్ ఏం చేస్తుంది?**

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 ప్రకారం, జనాభా లెక్కల తర్వాత ప్రతిసారీ డీలిమిటేషన్ చట్టం అమలు చేయబడుతుంది. ఆర్టికల్ 170 ప్రకారం, ప్రతి జనాభా గణన తర్వాత డీలిమిటేషన్ చట్టం ప్రకారం రాష్ట్రాలు కూడా ప్రాంతీయ నియోజకవర్గాలుగా విభజించబడ్డాయి. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తుంది. మొదటి డీలిమిటేషన్ 1950-51 సంవత్సరంలో జరిగినప్పటికీ, డీలిమిటేషన్ కమిషన్ చట్టం 1952లో ఆమోదించబడింది. దీని తరువాత, ఈ చట్టాలు 1962, 1972, 2002లో కూడా ఆమోదించబడ్డాయి. వీటి ఆధారంగా 1952, 1963, 1973, 2002లో డీలిమిటేషన్ కమిషన్లు ఏర్పాటు చేయబడ్డాయి.. వాటి ద్వారా నియోజకవర్గాల విభజన జరిగింది. అయితే, 1981, 1991 జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్ జరగలేదు. డీలిమిటేషన్ కమీషన్ ఎటువంటి కార్యనిర్వాహక ప్రభావం లేకుండా పని చేయడం.. రాజ్యాంగం ప్రకారం, ఈ కమిషన్ నిర్ణయమే అంతిమమైనది కావడం కూడా గమనార్హం. దాని నిర్ణయాన్ని కోర్టులో సవాలు చేయలేము, ఎందుకంటే అలా చేయడం వల్ల ఎన్నికలు ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. డీలిమిటేషన్ కమిషన్ నిర్ణయాన్ని లోక్ సభ లేదా రాష్ట్ర అసెంబ్లీ సవరించలేవు.

**రాష్ట్రాల వారీగా లోక్‌సభ స్థానాలు ఇలా..**

ప్రస్తుతం రాష్ట్రాల వారీగా లోక్‌సభ స్థానాల గురించి మాట్లాడితే, అత్యధికంగా 80 స్థానాలు ఉన్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్. మహారాష్ట్రలో 48, పశ్చిమ బెంగాల్‌లో 42, బీహార్‌లో 40 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో 29, ఆంధ్రప్రదేశ్‌లో 25, తమిళనాడులో 25, గుజరాత్‌లో 26, కర్ణాటకలో 28, కేరళలో 20, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, మిజోరాం, త్రిపుర, గోవాలో ఒక్కొక్కటి 2, అస్సాంలో 14, హర్యానాలో 10, జార?ండ్‌లో 14, 14 లో ఛత్తీస్‌గఢ్ 11, హిమాచల్ ప్రదేశ్‌లో 4, జమ్మూ కాశ్మీర్‌లో 5, నాగాలాండ్, మణిపూర్, లడఖ్, సిక్కిం, అండమాన్ %-% నికోబార్, చండీగఢ్, దాద్రా అండ్ నగర్ హవేలీ, డామన్ అండ్ డయ్యూ, లక్షద్వీప్, పుదుచ్చేరి, ఒడిశాలో 21. రాజస్థాన్‌లో 13, తెలంగాణలో 17, ఉత్తరాఖండ్‌లో 5, ఢిల్లీలో ఏడు స్థానాలు ఉన్నాయి.

# అదానీ గ్రూప్‌కు బొగ్గు మరకలు.. నల్లబంగారం మాటున భారీ మోసం



అమరావతి : గతేడాది మొత్తం అదానీ చుట్టూ హిండెన్ బర్గ్ రూపంలో ఉచ్చు బిగుసుకుంది. ఎట్టకేలకు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి సమర్థవంతంగా ఆ గండం గట్టెక్కారు.కాగా ఇప్పుడు మరో ఉదంతం వెలుగులోకి వచ్చింది. నల్ల బంగారం మరకలు అంటుకుంటున్నాయి.ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యుత్ పంపిణీ సంస్థ తమిళనాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (టాంగెడ్‌కో) విషయంలో అదానీ గ్రూప్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తక్కువ నాణ్యత కలిగిన బొగ్గును అత్యంత ఖరీదైన ఇంధనంగా విక్రయించి లావాదేవీలు జరిపినట్లు మీడియా నివేదికలు చెబుతున్నాయి.ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ సంస్థ సేకరించిన పత్రాలతో కూడిన నివేదికలు ప్రముఖ మీడియా సంస్థ రిలీజ్ చేసింది. 'అదానీ గ్రూప్ తక్కువ గ్రేడ్ బొగ్గును విద్యుత్ తయారీ కోసం మండిస్తోంది. ఎక్కువ ఇంధనాన్ని తగలబెట్టడం గాలి నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. తద్వారా బంపర్ లాభాలను పొంది ఉండవచ్చు' అని రిపోర్ట్ పేర్కొంది.నివేదిక ప్రకారం.. జనవరి 2014లో ఇండోనేషియాకు చెందిన బొగ్గును 3 వేల 500 కేలరీలు/కిలో చొప్పున అదానీ గ్రూప్ కొనుగోలు చేసింది. దీన్ని నౌకల ద్వారా తమిళనాడులోని టాంగెడ్కోకు రవాణా చేసి 6 వేలు కేలరీలు/కిలో అత్యంత విలువైన గ్రేడ్ బొగ్గుగా విక్రయించారు. ఈ విధంగా గౌతమ్ అదానీ రెట్టింపు కంటే ఎక్కువ లాభాలను ఆర్జించారు.తమ సంస్థపై వచ్చిన ఆరోపణలు, మీడియా నివేదికలను అదానీ గ్రూప్ ఖండించింది. లోడింగ్ మరియు డిశ్చార్జ్ సమయంలో బొగ్గు నాణ్యతను స్వతంత్రంగా పరీక్షించామని తెలిపింది. కస్టమ్స్ అధికారులు మరియు టాంగెడ్‌కో శాస్త్రవేత్తలు సైతం టెస్ట్ చేశారని వివరణ ఇచ్చింది. ఈ ఆరోణలు నిరాధారమని, పూర్తిగా అసంబద్ధమని తేల్చి చెప్పింది.

# బీజేపీ 305 సీట్లు గెలుస్తుంది.. అమెరికా పొలిటికల్ సైంటిస్ట్ అంచనా..



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు తుది దశకు వచ్చాయి. మరో రెండు విడతల్లో దేశంలోని 543 ఎంపీ స్థానాలకు ఎన్నికలు ముగియనున్నాయి. అయితే, ఈ సారి ఎన్నికల్లో మొత్తం అంకెల చుట్టూ తిరుగుతోంది.బీజేపీ స్వయంగా 370 సీట్లు, ఎన్డీయే కూటమి మొత్తంగా 400 కన్నా ఎక్కువ స్థానాలు గెలుస్తుందని బీజేపీ నేతలు చెబుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈ సారి బీజేపీ కేవలం 200 కన్నా తక్కువ స్థానాలకే పరిమితమవుతుంది, ఇండియా కూటమి 300 స్థానాలను కన్నా ఎక్కువ గెలుచుకుని అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది.ఇదిలా ఉంటే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 305(o/ - 10) గెలుచుకుంటుందని అమెరికన్ పొలిటికల్ సైంటిస్ట్, గ్లోబల్ పొలిటికల్ రిస్క్ కన్సల్టెంట్ ఇయాన్ బ్రెమ్మర్ మంగళవారం జాతీయ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రపంచ రాజకీయ దృక్కోణంలో భారత సార్వత్రిక ఎన్నికలు స్థిరంగా కనిపించే ఏకైక విషయమని, మిగతావన్నీ అమెరికా ఎన్నికలతో సహా సమస్యాత్మకంగా కనిపిస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం భౌగోళిక రాజకీయాలు నిశ్చితిలో ఉన్నాయని అన్నారు. ప్రపంచీకరణ కంపెనీలు కోరుకున్న విధంగా జరగడం లేదని చెప్పారు. రాజకీయాలు ప్రపంచ మార్కెట్లోకి ప్రవేశించడం.. యుద్ధాలు, యూఎస్-చైనా సంబంధాలు, అమెరికా ఎన్నికలు అన్నీ ఇందులో భాగమే అని అన్నారు. ఈ ఒత్తిళ్లు మరింత ప్రతీకూలంగా ఉన్నాయని, వాస్తవానికి రాజకీయంగా స్థిరంగా కనిపించే ఏకైక విషయం భారతదేశ ఎన్నికలే అని, మిగతావన్నీ సమస్యాత్మకంగా ఉన్నాయని చెప్పారు.ఏడు దశల్లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 295-315 సీట్లు గెలుస్తుందని అంచనా వేశారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో బీజేపీ 2014లో 282( ఎన్డీయే 336 సీట్లు), 2019లో 303 సీట్లు(ఎన్డీయే కూటమి 353) గెలుచుకుంది. ఇదిలా ఉంటే ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కూడా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి మరోసారి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. 2019లో సాధించిన సీట్లకు అటూ ఇటూగా లేదా, దాని కన్నా కొన్ని స్థానాలు ఎక్కువగా బీజేపీ గెలుచుకుంటుందని, ఆ పార్టీ చెప్పినట్లు 370 సీట్లు సాధించలేదని చెప్పారు.ప్రపంచంలోని పలు దేశాల్లో ఎన్నికలు ఉన్నాయని, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ సున్నితమైన ఎన్నికల ప్రక్రియను కలిగి ఉందని బ్రెమ్మర్ ప్రశంసించారు. బలమైన ఆర్థిక పనితీరు, స్థిరమైన సంస్కరణలతో మోడీ మూడోసారి గెలువబోతున్నారని అన్నారు. దశాబ్దాలుగా భారత్ పనితీరును పలు దేశాలు తక్కువగా చూసినప్పటికీ, ప్రస్తుత అమెరికన్ సీఈఓలు భారత్ వస్తున్నారని, తాము వృద్ధిని చూస్తున్నామని, భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడాన్ని చూశామని, బహుశా 2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించొచ్చని ఆయన అన్నారు. మిగిలిన దేశాలతో తన స్నేహాన్ని నిర్వహించే విషయంలో భారత్ శక్తివంతంగా మారడాన్ని ప్రపంచం చూస్తోందని చెప్పారు.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

## 2.11 లక్షల కోట్ల డివిడెండ్‌కు ఆర్బీఐ ఆమోదం..



హైదరాబాద్ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బిఐ) 2024 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వానికి దాదాపు 2.11 లక్షల కోట్ల రూపాయల డివిడెండ్ ను ఆమోదించింది. ఈ మొత్తం చివరి ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే దాదాపు 140% పెరుగుదల. FY23 లో, ఆర్బిఐ 87,416 కోట్ల రూపాయలను మిగులుగా కేంద్రానికి బదిలీ చేసింది. నేడు ముంబైలో జరిగిన సెంట్రల్ బోర్డు 608వ సమావేశంలో., సహా ప్రపంచ, దేశీయ ఆర్థిక పరిస్థితులపై బోర్డు చర్చించింది. ఈ సమావేశంలో 2,10,874 కోట్ల మిగులును బదిలీ చేయాలని బోర్డు నిర్ణయించింది. 2018 - 19 నుండి 2021-22 వరకు అకౌంటింగ్ సంవత్సరాల్లో.. ప్రస్తుత స్థూల ఆర్థిక పరిస్థితులను అలాగే కోవిడ్-19 మహమ్మారి కారణంగా., వృద్ధి, మొత్తం ఆర్థిక కార్యకలాపాలకు మద్దతుగా రిజర్వ్ బ్యాంక్ బ్యాలెన్స్ షీట్ లో సిఆర్బిని 5.50% గా ఉంచాలని బోర్డు నిర్ణయించిందని ఆర్బిఐ తెలిపింది. అయితే, FY23 లో ఆర్థిక వృద్ధి పునరుద్ధరణతో ఆకస్మిక రిస్క్ బఫర్ 6% కి పెరిగింది. FY24 కోసం ఇది మరింత 6.5% కి పెంచబడింది. ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా, స్థితిస్థాపకంగా ఉన్నందున 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సిఆర్బిని 6.5% కి పెంచాలని బోర్డు నిర్ణయించింది. 2023 - 24 అకౌంటింగ్ సంవత్సరానికి గాను మొత్తంగా 2,10,874 కోట్ల రూపాయల మిగులును కేంద్ర ప్రభుత్వానికి బదిలీ చేయడానికి బోర్డు ఆమోదం తెలిపింది. FY 24 కోసం ప్రభుత్వానికి లక్ష కోట్ల రూపాయలకు పైగా డివిడెండ్ ను ఆర్బిఐ ఆమోదిస్తుందని ఇదివరకు నివేదికలు సూచించాయి.

## రాహుల్ గాంధీ "అగ్నివీర్", "రాజ్యాంగం రద్దు" వ్యాఖ్యలపై ఈసీ ఆగ్రహం..

న్యూఢిల్లీ : కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఈ రోజు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి కీలక సూచనలు చేసింది. రక్షణ దళాల కార్యకలాపాలకు సంబంధించి రాజకీయ ప్రచారానికి పాల్పడొద్దని, రాజ్యాంగం రద్దు చేస్తారంటూ తప్పుడు అభిప్రాయాలను కలిగించే ప్రకటనలు చేయవద్దని ఆదేశించింది. ఈ రెండు ప్రచారాలతో రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్రమోడీని టార్గెట్ చేస్తున్నారు. తన రాజకీయ ప్రసంగాల సమయంలో రాజ్యాంగాన్ని ప్రదర్శిస్తున్నారు. త్రివిధ దళాల్లో ప్రవేశపెట్టి 'అగ్నివీర్' పథకానికి వ్యతిరేకంగా రాజకీయ ప్రసంగాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈసీ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేకి ఆదేశాలు వచ్చాయి. ఈ ఆదేశాలకు కొన్ని గంటల ముందు హర్యానాలో జరిగిన ఓ ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని ప్రకటించారు. తాజాగా ఈసీ పంపిన ఆదేశాల్లో ప్రముఖంగా రాహుల్ గాంధీ పేరును ప్రస్తావించనప్పటికీ, ఆయన చేసిన వ్యాఖ్యల్ని ప్రస్తావించింది. రాజకీయ పార్టీలు ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇలాంటి వ్యాఖ్యాన్ని అవకాశంగా ఉపయోగించుకుంటున్నాయని ఈసీ పేర్కొంది. కాంగ్రెస్ ప్రచారకర్తలు,



అభ్యర్థులు రక్షణ దళాల కార్యకలాపాలు, సామాజిక-ఆర్థిక కూర్పుకు సంబంధించి విభజన ప్రకటనలు చేయవద్దని ఖర్గేని కోరింది. భారత రాజ్యాంగం రద్దు చేయవచ్చనే తప్పుడు ప్రకటనలు చేయకుండా ఉండాల్సిందిగా కాంగ్రెస్ తన పార్టీ స్టార్ క్యాంపెనర్లను తప్పనిసరిగా కోరాలని పేర్కొంది. ఇటీవల రాహుల్ గాంధీ ప్రసంగాలపై ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ ఆదేశాలు వచ్చాయి.

## జూన్ 4 తర్వాత నిఫ్టీ 23 వేల మార్కు దాటనుందా?




అమరావతి : జూన్ 4 తర్వాత స్టాక్ మార్కెట్లకు మంచి రోజులు రాబోతున్నాయా? మార్కెట్ సూచీలు పరుగులు పెట్టబోతున్నాయా? అంటే సూచనలు అలానే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రజెంట్ మార్కెట్లు ఒడిదుడుకుల మధ్య కొనసాగుతున్నాయి. అయితే దేశంలో ముచ్చటగా మూడోసారి బీజేపీ అధికారం ఛేజిక్కించుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఐదు దశల పోలింగ్ ముగిసింది. ఆరో విడత మే 25న జరగనుంది. చివరి విడత జూన్ 1న జరగనుంది. ఇక ఎన్నికల ఫలితాలు మాత్రం జూన్ 4న విడుదల కానున్నాయి. అయితే జూన్ 4 తర్వాత స్టాక్ మార్కెట్ల సూచీలు పరుగులు పెట్టే సూచనలు కనిపిస్తున్నాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. బుధవారం స్టాక్ మార్కెట్లు సానుకూలంగా ముగిశాయి. నిఫ్టీ 23,000 మార్కుకు చేరువలో ముగిసింది. మరికొన్ని రోజుల్లో ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. మూడోసారి మోడీనే ప్రధాని కాబోతున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జూన్ 4 తర్వాత నిఫ్టీ 23 వేల మార్కు దాటడం ఖాయమని నివేదిక అందుతోంది. బుధవారం నిఫ్టీ 50 పాయింట్ల లాభపడి 22,597.8 పాయింట్ల దగ్గర ముగిసింది. ఇది త్వరలోనే 23 వేల మార్కు దాటడం ఖాయమని నిపుణులు భావిస్తున్నారు. 2024 లోకసభ ఎన్నికల ఫలితాల తర్వాత నిఫ్టీని 23,000 దాటి పోయే అవకాశం ఉందని అంతర్జాతీయ పరిశోధన సంస్థ బెర్న్‌స్టెయిన్ తెలిపింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మాన్యుఫ్యాక్చరింగ్, డొమెస్టిక్ సైక్లికల్, ఫైనాన్షియల్‌లు లాభాల్లో పయనించవచ్చని వెల్లడించింది. ఐటీ స్టాక్‌లు మాత్రం వెనుకబడి ఉండవచ్చని బెర్న్‌స్టెయిన్ ఒక నివేదికలో పేర్కొంది. స్మాల్ మరియు మిడ్ క్యాప్స్ కొన్ని రోజులు లార్జ్ క్యాప్స్ కంటే మెరుగ్గా పనిచేస్తాయని పేర్కొంది. తాజా పరిణామాలను అంచనా వేసి ఈ నివేదిక రూపొందించినట్లు బెర్న్‌స్టెయిన్ తెలిపింది. భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని.. ఆసియా దేశాలను ఇండియా అధిగమిస్తుందని నివేదికలో పేర్కొంది. మౌలిక సదుపాయాలు కల్పించడం, తయారీ రంగాన్ని పోత్సహించడం, ఆచరణీయమైన ఎగుమతి ఫ్రాంఛైజీని నిర్మించడం అవసరం అని అంతర్జాతీయ పరిశోధనా సంస్థ తెలిపింది. ఇక బీజేపీ 330-350 సీట్లు సాధించొచ్చని తెలిపింది.

## భారీగా పెరిగిన కరోనా కేసులు- అందుకు కారణాలు ఇవే

అమరావతి : ప్రపంచంలోని అనేక దేశాలు కరోనా కొత్త వేరియంట్ ఫ్లిర్ట్(%ఖీూఱ=%)కి బలైపోతున్నట్లు కనిపిస్తోంది. గత ఒక నెలలో యునైటెడ్ స్టేట్స్, సింగపూర్, భారతదేశంలో ఇన్ఫెక్షన్ కేసులు అకస్మాత్తుగా పెరిగాయి. ప్రస్తుతం సింగపూర్లో ఈ కొత్త వేరియంట్ బారిన పడిన వారిని అత్యధిక సంఖ్యలో గుర్తించారు. భారతదేశంలో కూడా కరోనా ముప్పు పెరుగుతోంది. దీంతో చాలా రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్లో కోవిడ్ కొత్త వేరియంట్ సోకిన వారి సంఖ్య ఇక్కడ ఎక్కువగా ఉంది. కరోనా ఈ కొత్త వేరియంట్కి సంబంధించిన అధ్యయనం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. ప్రాథమిక నివేదికల ప్రకారం.. కొత్త వేరియంట్ స్పైక్ ప్రోటీన్లో కొన్ని ఉత్పరివర్తనలు ఉద్భవించాయి. ఇవి సులభంగా శరీరంలోకి ప్రవేశించగలవు .. సోకిన తర్వాత ఇన్ఫెక్షన్ను పెంచగలవు. ఈ సంవత్సరం ప్రారంభం నుండి ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు చాలా స్థిరంగా ఉన్నాయి..కానీ ఇన్ఫెక్షన్ అకస్మాత్తుగా ఎందుకు పెరిగిందనేది చాలా మంది మదిలో మెదలుతున్న ప్రశ్న?



**15 రోజుల్లో 90 శాతం కేసులు**

మే 5 నుండి 11 వరకు అంటే ఒక వారంలో సింగపూర్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ నివేదించిన కరోనావైరస్ ఇన్ఫెక్షన్ల సంఖ్య 25,900 కంటే ఎక్కువ. అంతకుముందు వారం 13,700 కేసుల నుండి ఈ కేసుల్లో 90శాతం పెరుగుదల నమోదైంది. చాలా సందర్భాలలో ఫ్లిర్ట్ వేరియంట్ ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఫిబ్రవరి-మార్చిలో సింగపూర్లో సోకిన వ్యక్తుల సంఖ్య చాలా స్థిరంగా ఉంది. అయితే ఈ కొత్త వేరియంట్ అకస్మాత్తుగా ఎలా పెరిగింది. దీనిపై ఎపిడెమియాలజిస్టులు కారణాలు వెల్లడించారు. న్యూయార్క్లోని యూనివర్శిటీ ఆఫ్ బఫెలో ఇన్ఫెక్షియస్ డిసీజెస్ హెడ్ థామస్ ఎ. రస్సో మాట్లాడుతూ.. కరోనా కేసులు అకస్మాత్తుగా పెరగడానికి అనేక అంశాలు కారణమవుతాయని చెప్పారు. అతి ముఖ్యమైన కారణం ఏమిటంటే, వైరస్లు తమ ఉనికిని కాపాడుకోవడానికి నిరంతరం పరివర్తన చెందుతూ ఉంటాయి. ఒక్క కరోనా మాత్రమే కాదు, ఇది అన్ని వైరస్లతో జరిగే నిరంతర ప్రక్రియ. కరోనా ప్రాథమిక రూపం కూడా నిరంతరం మారుతూ ఉంటుంది. కొత్త వేరియంట్ ఫ్లిర్ట్ కూడా ఓమిక్రాన్ రూపాంతరం, మ్యుటేషన్ కారణంగా దాని స్పైక్ ప్రోటీన్లో కొన్ని మార్పులు కనిపిస్తున్నాయి. అవి దాని రూపాన్ని మారుస్తున్నాయి.

**రోగనిరోధక శక్తి తక్కువ ఉన్న వారే బాధితులు**

ఇది కాకుండా, సంక్రమణ పెరుగుదలకు మరొక కారణం ప్రపంచవ్యాప్తంగా బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్న వ్యక్తుల సంఖ్య. యువ జనాభాలో కరోనాకు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తి తగ్గిన కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీని కారణంగా కొత్త వేవ్ వ్యాప్తించే సంభావ్యత పెరుగుతోంది. జనాలపై టీకాల ప్రభావం కాలక్రమేణా తగ్గుతుంది, చాలా మందికి వారి చివరి టీకా తీసుకుని చాలా కాలం అయ్యింది, ఇది మరోసారి ఇన్ఫెక్షన్ కేసుల పెరుగుదలకు దారితీస్తుంది. కొన్ని అధ్యయనాలలో శాస్త్రవేత్తలు అటువంటి ప్రమాదాలను తగ్గించడానికి ఫ్లూ వంటి కోవిడ్ వ్యాక్సిన్కు వార్షిక టీకాలు వేయాలని కూడా సిఫార్సు చేస్తున్నారు.

**టీకా కవరేజీలో గ్యాప్**

కరోనా ఇన్ఫెక్షన్ కేసులు పెరగడానికి మూడవ కారణం వ్యాక్సిన్ కవరేజ్ ఏజ్ గా చెబుతున్నారు. సెప్టెంబర్ 2023 నుండి కేవలం 22.6శాతం పెద్దలు మాత్రమే కోవిడ్-19 వ్యాక్సిన్ని పొందారు. 75 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తులు ఈ కాలంలో ఎక్కువ టీకాలు వేసుకోవడంతో, టీకా కవరేజ్ వయస్సును బట్టి పెరిగిందని కూడా సీడీసీ డేటా చూపిస్తోంది.

## ఎన్నికల కమిషన్ కి జనసేన లేఖ.. దాడులపై ఫిర్యాదు

అమరావతి : ఏపీలో పోలింగ్ రోజున మొదలైన గొడవలు ఇంకా పలుచోట్ల జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఈ ఘటనలపై ఈసీ సీరియస్ అయింది. ఘర్షణలపై సిట్ కూడా దర్యాప్తు జరిపి ఈసీకి నివేదిక కూడా అందజేసింది. ఇదిలా ఉంటే రాష్ట్రంలో జరుగుతున్న గొడవలపై తిరుపతి జనసేన ఇన్‌ఛార్జ్ కిరణ్ రాయల్ మీడియాతో మాట్లాడుతూఎన్నికల తర్వాత రాష్ట్రంలో రౌడీయిజం, దాడులు ఎక్కువయ్యాయని ,ఈ ఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘానికి జనసేన లేఖ రాసిందని తెలిపారు. ఏపీలో అల్లర్లు, అలజడులను ఆపడంలో సీఎస్ జవహర్ రెడ్డి విఫలమయ్యారు. డీజీపీని మార్చినప్పుడు సీఎస్‌ను ఎందుకు మార్చలేదు అని పేర్కొన్నారు. సీఎస్ వైసీపీ కార్యకర్తగా వ్యవహరిస్తున్నారు. జవహర్ రెడ్డి సీఎస్‌గా ఉంటే కౌంటింగ్‌లో అక్రమాలు జరిగే అవకాశం ఉంది. జవహర్ రెడ్డిని వెంటనే బదిలీ చేయాలని ఈసీ కి లేఖ రాశాం. సిఎస్ నిన్న వైజాగ్‌కు రహస్యంగా ఎందుకు వెళ్లారో తెలియడం లేదు. సిట్ దర్యాప్తు సరిగ్గా లేదు. పులివర్తి నానిపై దాడి చేసిన కేసులో అమాయకులను అరెస్టు చేశారు అని ఆరోపించారు.

## అమెరికా వెళ్లే విద్యార్థులకు గుడ్ న్యూస్

న్యూఢిల్లీ : అమెరికాలో ఉన్నద చదువుకోసం వెళ్లే విద్యార్థులకు శుభవార్త వినిపించించి ఆ దేశ కౌన్సిల్ జనరల్%ొ%. వీసా బుకింగ్ స్లాట్ నిమిషాల వ్యవధిలో భర్తీ కానుండటంతో కౌన్సిల్ పిరియడ్ ను మరో రెండు వారాలు పెంచినట్లు ప్రకటించింది.. వివరాలలోకి వెళితే అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్లే విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది. విద్యార్థులకు ఆ దేశం జారీ చేసే స్టూడెంట్ వీసా (ఎఫ్-1) లకు డిమాండ్ చాలా ఎక్కువ. దీంతో వాటి కోసం విడుదల చేసే ఇంటర్వ్యూ స్లాట్ లకూ విపరీతమైన డిమాండ్ నెలకొంది. సోమవారం ఎఫ్-1 వీసా స్లాట్లు ఆన్ లైన్ లో విడుదల చేయగా.. కేవలం ఐదు నిమిషాల్లోనే ఏకంగా పదివేల స్లాట్లు బుక్ అయ్యాయి. దీంతో అమెరికా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్న విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే యూనివర్సిటీల అడ్మిషన్ సంపాదించిన పలువురు విద్యార్థులు.. ఎఫ్-1 వీసా ఇంటర్వ్యూ కోసం స్లాట్ బుక్ చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది విద్యార్థులు ఏకంగా ఆరు నెలల నుంచి వీసా ఇంటర్వ్యూ కోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. వీసా స్లాట్లు విడుదల చేసిన ప్రతిసారీ నిమిషాల వ్యవధిలోనే బుక్ అవుతున్నాయని చెబుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో అమెరికాలోని వివిధ యూనివర్సిటీలలో చేరేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ వీసా ఇంటర్వ్యూ విషయంలోనే ఇబ్బంది పడుతున్నామని వివరించారు. ఇంటర్వ్యూ కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవడం గగనమైపోయిందని, స్లాట్లు దొరకడంలేదని వాపోయారు. తాజాగా సోమవారం కూడా ఐదు నిమిషాల్లో పది వేల వీసా స్లాట్లు బుక్ కావడంతో విద్యార్థుల్లో టెన్షన్ నెలకొంది. దీంతో పలువురు విద్యార్థులు తమ పరిస్థితిని వివరిస్తూ వీసా స్లాట్లు పెంచాలంటూ అమెరికన్ ఎంబసీకి ఆన్ లైన్ లో రిక్వెస్ట్ పెడుతున్నారు. ఈ విజ్ఞప్తులపై హైదరాబాద్ లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ ట్విట్టర్ లో స్పందించారు. స్టూడెంట్ వీసా సెషన్ ను రెండు వారాల పాటు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఏడు లక్షా 50 వేల మంది విద్యార్థులకు స్టూడెంట్ వీసాలు ఇవ్వనున్నట్లు ఇప్పటికే అమెరికా ఇమ్మిగ్రేషన్ శాఖ ప్రకటించింది.. అందుకనుగుణంగా ఇండియాలోని చెన్నై, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ లో ఉన్న అమెరికన్ కాన్సులేట్ లో వీసా ఇంటర్వ్యూలను మరో రెండు వారాల వరకు కొనసాగించనున్నట్లు ఒక ప్రకటన వెలువడింది.

## వాహనదారులకు హెచ్చరిక.. ఇకపై టూవీలర్స్ అలా చేస్తే లైసెన్స్ రద్దు.. పోలీసులు కీలక ఆదేశాలు..



అమరావతి : ద్విచక్ర వాహనదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను ఎలాంటి మార్పు చేయకూడదు. ఒకవేళ మార్పు చేస్తే వాహనదారుడితో పాటు మార్పు చేసిన మెకానిక్‌పై కూడా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులు బుధవారం సి. పి. ఓ జంక్షన్ వద్ద అధిక శబ్దం చేసే ద్విచక్రవాహన సైలెన్సర్లను స్వాధీనం చేసుకుని రోడ్ రోలర్?తో ధ్వంసం చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు పోలీసులు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల కంపెనీ సైలెన్సర్ స్థానంలో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల ఏర్పాటుపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఇందులో భాగంగా గత కొద్ది రోజులుగా ట్రై సిటీ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలు విరుద్ధంగా.. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు ఏర్పాటు చేసిన ద్విచక్రవాహనాలను గుర్తించారు. ట్రాఫిక్ పోలీసులు తొలగించిన 261కు పైగా సైలెన్సర్లను మరోమారు వినియోగించకుండా రోడ్ రోలర్ సాయంతో ధ్వంసం చేసారు. ధ్వంసం చేసిన సైలెన్సర్లలో హనుమకొండకు చెందినవి 73 కాగా కాజీపేట 88, వరంగల్?కు చెందినవి 100 వున్నాయి. అనంతరం ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ సిపి అదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్పు చేయడం చట్టరిత్యా నేరమని తెలిపారు. అలాగే శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు ప్రజాఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకోని ఈ చర్యలకు పాల్పడినట్లు వివరించారు. అధికంగా శబ్దం చేసే ద్విచక్రవాహనలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టామన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. ఎవరైన సైలెన్సర్ మార్పు చేస్తే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడమే కాకుండా ఆ వాహనదారుడి లైసెన్స్?ను 3 నెలలపాటు రద్దు చేస్తామని చెప్పారు. ఆ వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే తమ మెకానిక్లులు కూడా ఎట్టి పరిస్థితిలో ద్విచక్రవాహనాలకు సైలెన్సర్ల మార్పుకు ప్రోత్సహించవద్దని సూచించారు. ఇకపైన సైలెన్సర్ల మార్పుకు సహకరించిన మెకానిక్లపై క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

## జూన్ నాటికి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం: అదనపు కలెక్టర్



భువనగిరి: జూన్ ఒకటవ తేదీలోగా ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేస్తామని జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టరు పి.బెన్షాలోమ్ తెలిపారు. బుధవారం ఆయన ధాన్యం కొనుగోళ్లపై మాట్లాడుతూ. జిల్లాలో 323 ధాన్యం కొనుగోళ్ల ఏర్పాటు ద్వారా ఇప్పటి వరకు 2 లక్షల 82 వేల 330 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేశామన్నరు. 77 సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి అయి మూసి వేయడం జరిగిందని, మిగతా 246 కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి రోజూ 320 లారీలు మిల్లులకు ధాన్యం తరలిస్తున్నాయని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బంది లేకుండా హన్మకొండ జిల్లాకు పది వేలు, జనగాం జిల్లాకు 40 వేలు, రంగారెడ్డి జిల్లాకు పది వేలు, నల్లగొండ జిల్లాకు 15 వేలు మెట్రిక్ టన్నుల ధాన్యం పంపిస్తున్నట్లు తెలిపారు.

## ఆప్ నేతలపై మరో బాంబు పేల్చిన రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్.. ఈసారి ఏమన్నారంటే..?

న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్ పట్ల అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణల కేసు దేశవ్యాప్తంగా సంచలన కలిగిన విషయం తెలిసిందే. ఈ విషయంలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు ఆయన పార్టీ ఆప్ కూడా చిక్కుల్లో పడింది. తాజాగా స్వాతి మలివాల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా చేసిన పోస్ట్ దుమారం రేపుతోంది. తనకు పార్టీకి చెందిన ఓ పెద్ద నాయకుడి నుంచి కాల్ వచ్చిందని, తన వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఆప్ నేతలు కుట్రలు పన్నుతున్నారని స్వాతి తాజాగా మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. తన వ్యక్తిగత ఫొటోలు లీక్ చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని స్వాతి మలివాల్ 'ఎక్స్' వేదికగా తెలిపారు. తనకు ఎవరు మద్దతిస్తే వారిని పార్టీ నుంచి బహిష్కరిస్తారని చెబుతున్నారన్నారు. తనపై అభ్యంతరకర ఆరోపణలు చేయాలంటూ పార్టీలోని ప్రతి ఒక్కరిపై ఒత్తిడి పెంచుతున్నారని చెప్పారు. తనను వ్యక్తిగత అభాసుపాలు చేసేందుకు ఆప్ పార్టీ ముఖ్యనేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తనపై అసభ్యకరంగా మీడియా సమావేశం పెట్టి మాట్లాడాలంటూ కొందరికి డ్యూటీ చేశారని, ట్వీట్ చేసే బాధ్యత మరొకరికి వచ్చిందని రాశారు. అమెరికాలో కూర్చున్న వాలంటీర్లను పిలిపించి తనపై ఏదో ఒకటి మాట్లాడాలంటూ ఉసిగొలుపుతున్నారని ఆరోపించారు. కొన్ని నకిలీ స్టింగ్ ఆపరేషన్‌ను సిద్ధం చేయాలంటూ మరికొందరిని రంగంలోకి దింపారని, ఇలా వేల మంది సైన్యాన్ని పెంచుతున్నారు, ఒంటరిగా



ఎదుర్కొంటానని, నిజం నా దగ్గర ఉంది. వారిపై నాకు ఎలాంటి కోపం లేదు, నిందితుడు చాలా శక్తిమంతుడు. పెద్ద నాయకుడైనా అతడికి భయపడేదీ లేదని స్వాతి మలివాల్ తేల్చి చెప్పారు. స్వాతి మలివాల్ కూడా అదే పోస్ట్‌లో తనకు వ్యతిరేకంగా నిలబడే ధైర్యం ఎవరికీ లేదని రాశారు. ఎవరి నుంచి ఏమీ ఆశించను. ఆత్మగౌరవం కోసం నేను పోరాటం ప్రారంభించాను, నాకు న్యాయం జరిగే వరకు పోరాడుతూనే ఉంటాను. ఈ పోరాటంలో నేను పూర్తిగా ఒంటరిగా ఉన్నాను కానీ నేను వదులుకోను. అంటూ రాసుకొచ్చారు. వాస్తవానికి, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రైవేట్ సెక్రటరీ విభవ్ కుమార్ తనతో అనుచితంగా ప్రవర్తించారని, మే 13న సీఎం నివాసంలో తనను కొట్టారని స్వాతి మలివాల్ ఆరోపించారు.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# Anand Mahindra pitches 'trishul' model to make India a global superpower

Anand Mahindra, the chairperson of Mahindra and Mahindra, on Sunday pitched a "trishul" model to make India a global superpower in the eyes of powerful governments, seeking inspiration from the model on which the United States operates.While speaking at the 4th Annual Atal Bihari Vajpayee Lecture in New Delhi, Anand Mahindra talked about what factors can help India create a global influence or Antarrashtriya Samman. He further said that business and commerce can make a vital contribution towards our aspiration of earning international respect.Taking a "practical approach" to how India can turn into a country with an even stronger global influence, Anand Mahindra sought inspiration from the US, which has been regarded as the benchmark for strong influence for decades.Mahindra said, "Let me look at the country which, for better or for worse, is regarded as the most powerful and influential nation in the world today-the United States of America."He said that there are three prongs with which the US has gained global influence, which are - world-leading military might; unparalleled soft power and influence across the world; and a dominant role in the world economy which embraces the power of American businesses.Mahindra further said that by using the same three-pronged or "Trishul" approach, India can too gain Antarrashtriya Samman. "From his actions, it's clear that Prime Minister Modi has understood the importance of all three prongs and is working feverishly on all fronts," he said.

**Anand Mahindra's three-pronged model for India**

